శనివారం
04-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 223
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వోల్గోగ్రాడ్‌లో స్టాలిన్ విగ్రహావిష్కరణ

రెండవ ప్రపంచ యుద్ధంలో భాగంగా నాజీ ఆక్రమణదారులపై ఎర్ర సైన్యం విజయానికి 80 ఏళ్లు అయిన సందర్భంగా సోవియట్ నాయకుడు జోసెఫ్ స్టాలిన్ విగ్రహాన్ని, రష్యాలోని వోల్గోగ్రాడ్‌లో ఆవిష్కరించారు.

2లో

అదానీపై చర్చకు నో

వెనకేసుకొస్తున్న మోదీ ప్రభుత్వం

జేపీసీ విచారణకు ప్రతిపక్షాల డిమాండ్

సాగని చట్టసభలు ... సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గౌతమ్ అదానీ వ్యవహారం శుక్రవారం కూడా పార్లమెంటును కుదిపేసింది. మార్కెట్‌లలో అదానీ గ్రూప్ డీలాపడినందున ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీ భారీగా నష్టపోయే ప్రమాదం ఉండటంతో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ లేదా సీజేఐ నేతృత్వంలోని కమిటీతో దర్యాప్తు జరిపించాలని లోక్‌సభలో, రాజ్యసభలో ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం అంశాలపై కూడా చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. కార్పొరేట్ల కొమ్ముకాసే ప్రభుత్వం అందుకు స్పందించకపోవడంతో ఉభయసభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో సోమవారం వరకు ఉభయ సభలు వాయిదా పడ్డాయి. అదానీ గ్రూప్ తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని పరిశోధక సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపణలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు సభలో రెండు రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. విపక్ష సభ్యుల నినాదాలతో

- మిగతా 2 లో

కోర్టు ఉత్తర్వులంటేనే లెక్కలేదా ?

ఏమవుతుందిలే అని బరి తెగింపా ?

ఐఏఎస్‌లపై హైకోర్టు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఉపాధిహామీ బిల్లుల చెల్లింపు కేసులో ఐఏఎస్‌లపై హైకోర్టు శుక్రవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. కోర్టు ఉత్తర్వులంటే మీకు లెక్కలేదా ? లేక ఏమవుతుందిలే అని బరితెగింపా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఏఎస్ అధికారులు భ్రమల్లో ఉండవద్దని హితవు పలికింది. కోర్టు ధిక్కరణ కేసుల్లో ద్వివేది, రావత్ హాజరుకావటంపై విస్మయం వ్యక్తం చేసింది. రోజూ మిమ్మల్ని చూసేందుకు చికాకు వేస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఏపీ హైకోర్టులోనే కోర్టు ధిక్కరణ కేసులు ఎక్కువని న్యాయస్థానం తెలిపింది. అధికారుల తీరు వల్లే ఈ పరిస్థితి అంటూ పేర్కొంది. దాదాపు 70 కోర్టుధిక్కరణ కేసుల్లో ఉన్న ద్వివేది, రావత్ లను ఉద్దేశించి న్యాయస్థానం పై వ్యాఖ్యలు చేసింది.

హోదాపై ప్రైవేటు బిల్లు

- ఇవ్వలేమని ఎన్నిసార్లు చెప్పినా అడుగుతూనే ఉంటాం
- ఇవ్వమని తెలంగాణ కూడా చెప్పింది కదా !
- పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ నెరవేర్చాల్సిందే
- రైల్వేజోన్, ఇతర విభజన అంశాలపైనా కేంద్రాన్ని నిలదీస్తాం
- వైసీపీ ఎంపీలు రంగయ్య, బోసు, రెడ్డప్ప వెల్లడి

2లో

కల్లాల్లో ధాన్యం...

కష్టాల్లో రైతాంగం

- కొనుగోలు కోసం ఎదురు చూపులు
- రైతుల వద్ద ఇంకా లక్ష టన్నుల ధాన్యం

(విశాలాంధ్ర-విజయనగరం/భోగాపురం/వేపాడ/దత్తిరాజేరు/గుర్ల) ధాన్యం సేకరణ కోసం విజయనగరం జిల్లా రైతాంగం ఇంకా ఎదురుచూపులు చూస్తోంది. తమ కష్టానికి ప్రతిఫలం దక్కుతుందో, లేదోననే ఆందోళనలో రైతులు ఉన్నారు. కల్లాల్లో ధాన్యం నిల్వలకు కాసులు రూపం ఎప్పుడు వస్తుందోననే ఆవేదన రైతుల్లో కనిపిస్తోంది. ధాన్యం బస్తాలను ట్రాక్టర్లలో నింపుకుని అధికారుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఖరీఫ్‌లో 5 లక్షల టన్నులకు పైగా దిగుబడి ఉంటుందని అంచనా వేశారు. గత ఏడాది డిసెంబరు 20 నుంచి ధాన్యం సేకరణ ప్రారంభించారు. మొత్తం మీద 3.68 లక్షల టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ఇప్పటి వరకు సుమారు 2.92 లక్షల టన్నులను సేకరించడంతో పాటు ఆయా రైతుల ఖాతాల్లో సకాలంలో సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇంకా సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉండిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణకు కొత్త విధానం తీసుకువచ్చింది. దళారుల ప్రమేయం లేకుండా రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేయడమే నూతన విధాన ప్రథమ లక్ష్యం. ఈ కొత్త విధానం వల్ల జిల్లాలో ధాన్యం సేకరణకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. ధాన్యం సేకరణకు అవసరమైన బ్యాగ్‌ల దగ్గర నుంచి అనేక సమస్యలు ప్రాథమికంగా ఎదురయ్యాయి. ధాన్యాన్ని ఆర్బీకేలకు, అక్కడ నుంచి మిల్లులకు తరలించేటప్పుడు చెల్లించే రవాణా విషయంలోనూ సమస్యలు తలెత్తాయి. అయితే వాటిని

- మిగతా 2 లో

బడ్జెట్‌పై 13న సీపీఐ నిరసన

అదానీ గ్రూపుపై జేపీసీ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 13న నిరసన దినం పాటించాలని పార్టీ శాఖలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పిలుపునిచ్చింది. అలాగే అదానీ గ్రూపు వ్యవహారంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఎల్ఐసీ, ఎస్‌బీఐ, కేంద్రప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టాలని పార్టీ శాఖలకు సూచిస్తూ సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం శుక్రవారం ఒక ప్రకటన

- మిగతా 2 లో

రెండున్నర లక్షల ఉద్యోగాలిస్తాం

- పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ
- ప్రభుత్వ ఉద్యోగులకు ఏటా రెండు డీఏలు
- త్రిపురలో లెఫ్ట్‌ఫ్రంట్ మేనిఫెస్టో హామీ
- బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం హననం: నారాయణ్ కర్

అగర్తల: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తోంది. గెలుపు కోసం రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్‌ఫ్రంట్ వ్యూహాలు రచిస్తోంది. ప్రజలకు మరింత చేరువ కావడానికి ప్రయత్నిస్తోంది. బీజేపీ పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత ప్రదర్శిస్తున్న అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటున్నది. అందులో భాగంగా లెఫ్ట్‌ఫ్రంట్ శుక్రవారం ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించింది. తమకు అధికారం అప్పగిస్తే 2.5 లక్షల కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుపేద వృద్ధులకు పెన్షన్ అందిస్తామని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులకు యేటా రెండు డీఏలు పెంచుతామని హామీ ఇచ్చింది. 15 పేజీల మేనిఫెస్టోలో ప్రజలకు అవసరమైన, ఆచరణ సాధ్యమైన హామీలు ప్రకటించింది. తొలగించిన 10,323 మంది ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, ఒప్పంద కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని, గిరిజన మండలికి మరింత స్వయం ప్రతిపత్తి కల్పిస్తామని హామీ ఇచ్చింది. లెఫ్ట్‌ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్ విలేకరుల

- మిగతా 2 లో

రోడ్డెక్కిన వీధి వ్యాపారులు

- సదస్సుల పేరుతో జీవితాలు నాశనం చేస్తారా?
- ప్రత్యామ్నాయం చూపరా?
- విశాఖలో తోపుడుబండ్ల కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఎండనకా, వాననకా తోపుడు బండ్లపై చిరువ్యాపారాలు చేసుకుని బతుకుతున్న తమ జీవనాన్ని దెబ్బతీయొద్దని అధికారులను వీధివిక్రయదారులు వేడుకుంటున్నారు. విశాఖ నగరానికి వీఐపీల తాకిడి ఎక్కువ. అప్పుడు ఒకటి, రెండు రోజులు ముఖ్యమైన రహదారుల్లో వీధి వ్యాపారాలు ఆపేస్తుంటారు. ఇప్పుడు రెండు నెలలపాటు వీధి వ్యాపారాలు చేయొద్దని అధికారులు చెప్పడం... వారి జీవితాల్లో పిడుగు పడినట్లు అయింది. బతుకుతెరువు కోసం వచ్చిన 40 వేల మంది వీధి విక్రయదారులు విశాఖ నగరంలో అనేక రహదారుల వెంబడి చిరువ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్నారు. ప్రధానంగా బీచ్ రోడ్‌లో మురి మిక్చర్ దగ్గర నుంచి న్యూడిల్స్, పానీపూరి, ఐస్ క్రీమ్, పండ్లు, పల్లీలు, దుస్తులు, చెప్పులు, కూరగాయలు, చెరుకు రసం...ఇలా అనేక రకాల వ్యాపారాలు చేసుకుంటూ రోడ్లపైనే బతుకులీడుస్తున్నారు. సదస్సుల పేరుతో వ్యాపారాలు బంద్ చేయాలన్న అధికారుల ఆదేశాలు తోపుడుబండ్ల కార్మికుల కళ్లలో కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఫిషింగ్ హార్బర్ నుంచి ఆర్కే బీచ్ జంక్షన్ మీదుగా బీచ్ రోడ్డులో ఉన్న తెన్నేటి పార్క్, సాగర్‌నగర్, రిషికొండ మీదుగా భీమిలి వరకు ఫిబ్రవరి, మార్చిలో తోపుడుబండ్ల వ్యాపారం ఆపాలని అధికారులు హుకుం జారీ చేశారని చిరువ్యాపారాలు ఆందోళన చెందుతున్నారు. ఎంవీపీ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్డుతో పాటు 22 ప్రాంతాల్లో వీధివ్యాపారాలు నిలిపివేయాలని అధికారులు చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని దినసరి కూలీలుగా, చిరువ్యాపారాలు చేసుకుంటూ రోజుకు రూ.500 సంపాదించుకునే బతుకులపై దెబ్బకొట్టడం, వేధించడం సరికాదని మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, ఇతర ప్రముఖులు వచ్చిన సమయంలో వ్యాపారాలు ఆపే అధికారులు ఇప్పుడు శాశ్వతంగా రెండు నెలలు వద్దని చెప్పడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నదని మండిపడుతున్నారు. మరోరెండు నెలల్లో విశాఖకు మకాం మారుస్తున్నట్లు సీఎం జగన్ చెప్పారని, ఆయన వస్తే శాశ్వతంగా వ్యాపారం నిలిచిపోవడమేనని వీధివిక్రయదారుల ఆవేదన చెందుతున్నారు. వీధివిక్రయదారులకు ప్రత్యామ్నాయం ఏమిటని వీధి విక్రయదారులసంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సమస్యలు పరిష్కరించకుంటే

తగిన బుద్ధి చెప్తుతాం

- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల ఉద్యమానికి ఏడాదైన సందర్భంగా ధర్నా
- పెద్దఎత్తున హాజరైన ఉద్యోగ, కార్మిక సంఘాలు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు విమర్శించారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డీఏ అరియర్స్ వెంటనే ఇవ్వాలని, జీతాలు, పెన్షన్లు ఉద్యోగస్తులకు ప్రతి నెల ఒకటో తేదీకి చెల్లించాలని, వాడుకున్న జీపీఎఫ్ నిధులు వెంటనే ఇవ్వాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నేతృత్వంలో శుక్రవారం ఇక్కడి ధర్నా చౌక్‌లో

- మిగతా 2 లో

కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు

- అంతిమ యాత్రకు తరలివచ్చిన అభిమానులు
- సినీ, రాజకీయ ప్రముఖుల నివాళి
- పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు

8లో

ఉత్తర కొరియాలో 'స్టేట్ సీక్రెట్' చట్టం

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియాలో గోప్యతా పరిరక్షణ చట్టానికి ఆమోదం లభించింది. జాతీయ భద్రత, సోషలిస్టు వ్యవస్థ అభివృద్ధికి సంబంధించి 'స్టేట్ సీక్రెట్' పరిరక్షణ కోసం కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) శుక్రవారం నివేదించింది. ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించలేదు. ఈ చట్టం క్రమంలో ఒక్క రహస్యమా లేక బహుళ రహస్యాలను కాపాడతారా అన్న స్పష్టతలేదు. ఉత్తర కొరియాలో దీర్ఘకాలిక ఆర్థిక సవాళ్ల మధ్య దేశ నియంత్రణ-క్రమశిక్షణ కట్టుదిట్టం చేసేందుకు కొత్త చట్టాన్ని తీసుకు వచ్చినట్లు పరిశీలకుల అభిప్రాయమంటూ యోన్‌హాప్ వార్తాసంస్థ పేర్కొంది. అయితే ఉత్తర కొరియా ప్లీనరీ సమావేశంలో సోషలిస్టు చట్టం, పరిశీలన దిక్సూచి కమిటీలను అన్ని స్థాయిల్లో ఏర్పాటు చేయడం ద్వారా చట్టం అమలు సక్రమంగా జరిగే విధంగా చర్చ జరిగినట్లు కేసీఎన్ఏ వెల్లడించింది. స్టేట్ సీక్రెట్‌తో పాటుగా రైల్వే నిర్వహణ, రుణాలు, జాతీయ చిహ్నాలు తదితర చట్టాలకూ సమావేశం ఆమోదం తెలిపినట్లు వార్తానివేదిక తెలిపింది.

రష్యాపై మరిన్ని ఆంక్షలు విధిస్తాం

ఉక్రెయిన్‌కు ఈయూ హామీ

యుద్ధం మధ్యలో కీలక సదస్సు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులు జరుగుతున్న వేళ యూరోపియన్ యూనియన్-ఉక్రెయిన్ సదస్సు కీవ్‌లో జరిగింది. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించనున్నట్లు ఈ సందర్భంగా ఈయూ ప్రకటించింది. ఈనెల 24వ తేదీకి ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి సంవత్సరం పూర్తి అవుతుందని, ఈ సందర్భంగా తమ ఆంక్షల పదవ ప్యాకేజిని రష్యాపై విధించాలని భావిస్తున్నట్లు యూరోపియన్ యూనియన్ ఉన్నతాధికారులు, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోన్ డెర్ లెనెన్ తెలిపారు. ఆమెతో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు చార్లెస్ మైఖెల్ నేతృత్వంలో 15 మంది ఈయూ కమిషనర్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సదస్సుతో తమ సహకార బంధం మరింత పటిష్టమవుతుందని ఆకాంక్షించారు. ఉక్రెయిన్‌కు ఈయూ సభ్యత్వంపై త్వరలోనే నిర్ణయాన్ని తెలియజేస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి యూరోపియన్ కమిషన్ షరతులకు ఉక్రెయిన్ అంగీకరించే తదుపరి ఎలా ముందుకు సాగాలో నిర్ణయిస్తామని చెప్పారు. రష్యా భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని ఉర్సుల నొక్కిచెప్పారు. మరికొన్ని ఆంక్షలను ఆ దేశంపై ఈయూ విధిస్తుందని జెలెన్‌స్కీకి హామీనిచ్చారు. 'ఇప్పటికే రష్యా భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోంది. మా ఆంక్షలు ఆ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. 24 ఫిబ్రవరికి ఈ యుద్ధానికి కచ్చితంగా ఏడాది అవుతుంది. ఈ సందర్భంగా ఆంక్షల పదవ ప్యాకేజిని విధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ఆమె చెప్పారు. అయితే ఏయే రంగాలపై ఆంక్షలు ఉంటాయి... ఎగుమతులను లక్ష్యంగా చేసుకుంటారా వంటి వివరాలివ్వలేదు. రష్యాపై యూరప్ ఆంక్షల గతి తగ్గిందని, దీనిని పెంచాలని జెలెన్‌స్కీ విజ్ఞప్తిచేయగా ఉర్సులా పై విధంగా స్పందించారు. అలాగే ఉక్రెయిన్‌కు అన్ని విధాలా సహకరిస్తామని, తమ మార్కెట్లకు టారిఫ్ రహిత ప్రవేశాన్ని కల్పిస్తామని చెప్పారు. అంతకంటే ముందు ఈయూ సభ్యత్వం కోసం పెట్టుకున్న దరఖాస్తులో యూరోపియన్ కమిషనర్ షరతలకు ఉక్రెయిన్ అంగీకరించాల్సి ఉంటుందని, మరిన్ని విషయాల్లోనూ స్పష్ట త వచ్చాక తదుపరి కార్యాచరణను ఈయూ నిర్ణయిస్తుందని యూరోపియన్ కమిషనర్ వెల్లడించారు.

విశాలాంధ్ర ప్రపంచం

వోల్గోగ్రాడ్‌లో స్టాలిన్ విగ్రహావిష్కరణ

వోల్గోగ్రాడ్ (రష్యా): రెండవ ప్రపంచ యుద్ధంలో భాగంగా నాజీ ఆక్రమణదారులపై ఎర్ర సైన్యం విజయానికి 80 ఏళ్లు అయిన సందర్భంగా సోవియట్ నాయకుడు జోసెఫ్ స్టాలిన్ విగ్రహాన్ని రష్యాలోని వోల్గోగ్రాడ్‌లో ఆవిష్కరించారు. సోవియట్ కమాండర్లు జార్జీ జుకోవ్, అలెగ్జాండర్ వసిలేస్కీల విగ్రహాల పక్కనే స్టాలిన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దక్షిణ రష్యాలోని వోల్గా నదిపై ఉన్న పారిశ్రామిక నగరం 1925లో స్టాలిన్ గౌరవార్థం పేరు మార్చారు. క్రుష్చెవ్ నేతృత్వంలోని డీ-స్టాలినైజేషన్ ప్రక్రియను అనుసరించి, ఆయన మరణం తర్వాత ఎనిమిదేళ్ల తర్వాత 1961లో వోల్గోగ్రాడ్‌గా మారింది.

మైన్మార్‌లోని 37ప్రాంతాల్లో మార్షల్ లా

యంగాన్: మైన్మార్‌లోని నాలుగు రాష్ట్రాల్లోగల 37 పట్టణాల్లో మార్షల్ లా విధించినట్లు ఆ దేశ పాలకమండలి ప్రకటించింది. మార్షల్ లా విధించిన పట్టణాల్లో 11 సగైంగ్ ప్రాంతంలో ఉండగా ఏడు చిన్ రాష్ట్రంలో ఉన్నాయి. అలాగే మగ్వే, బాగో ప్రాంతాల్లో ఐదు చొప్పున, కయా రాష్ట్రంలో నాలుగు, తనిన్‌థాయి ప్రాంతంలో, కెయిన్ రాష్ట్రంలో చెరో రెండు ఉన్నట్లు అధికారిక ప్రకటన పేర్కొన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను సంబంధిత మిలటరీ కామాండ్‌ల కమాండర్లకు పాలకమండలి అప్పగించింది. పారిపాలన, న్యాయపరమైన అధికారాలను కట్టబెట్టింది. మరో ఆరు నెలలు అత్యవసర పరిస్థితి కొనసాగుతుందని ప్రకటించిన మరుసటి రోజు తాజా పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

కె.విశ్వనాథ్ మృతికి రామకృష్ణ సంతాపం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు కళాతపస్వి కె.విశ్వనాథ్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. కె.విశ్వనాథ్ తెలుగు చలనచిత్ర చరిత్రలో తనదైన ముద్ర వేశారని, ఆయన మరణం తెలుగు సినీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, కళలు, సంప్రదాయాల మేళవింపుగా ఆయన చిత్రాలు ఉన్నాయని తెలిపారు. ఆయన దర్శకత్వ ప్రతిభ తెలుగు కళామతల్లికి మణిహారమని, ఆయన మృతికి సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సంతాపం ప్రకటిస్తూ...కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

శ్రీనివాసరావు సంతాపం

విశ్వనాథ్ మృతికి సీపీఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. సౌండ్ రికార్డు ఆర్టిస్టుగా సినీ జీవితం ప్రారంభించిన ఆయన...దర్శకుడిగా సామాజిక సంస్కరణల ఆవశ్యకతపై అనేక మంచి చిత్రాలు అందించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకనటలో పేర్కొన్నారు. ఆయన చిత్రాలలో తెలుగు సంస్కృతి ప్రతిబింబిస్తుందని, ఆయన మరణం సినీ రంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హోదాపై ప్రైవేటు బిల్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం పార్లమెంటులో ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశ పెడతామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తలారి రంగయ్య, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎన్.రెడ్డప్ప తెలిపారు. ప్రత్యేక హోదా అన్నది ముగిసిన అధ్యాయం(క్లోజ్డ్ చాప్టర్) కాదని, పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ అని ఎంపీలు గుర్తు చేశారు. విభజన హామీలు సాధించుకోవడం కోసం పార్లమెంటులో గళమెత్తుతామని తెలిపారు. దిల్లీలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చెబుతున్నట్లుగా ప్రత్యేక హోదా అనేది క్లోజ్డ్ చాప్టర్ కాదు. వాళ్లు ఎన్నిసార్లు హోదా ఇవ్వలేమని చెప్పినా మేం అన్నిసార్లు అడుగుతూనే ఉంటామని స్పష్టం చేశారు. విభజన చట్టంలో ప్రతిపాదించి ఇప్పటి వరకూ అమలు కాని అంశాలపైనా ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు. వాస్తవానికి దీనిపై శుక్రవారం చర్చ ఉన్నా సభ వాయిదా పడటంతో కుదరలేదు. అవకాశం రాగానే మిగతా పార్టీల మద్దతు కూడగట్టుకుని ఓటింగ్‌కి వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హోదా హామీని నెరవేర్చాల్సిందేనని వారు స్పష్టం చేశారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యసభలో ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇస్తే, అప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ దాన్ని సమర్థించిందని గుర్తు చేశారు. విభజన చట్టం ప్రకారం ఇంకా రాష్ట్రానికి రావాల్సినవి చాలా ఉన్నాయన్నారు. వాటిని సాధించడం కోసం పార్టీ తరపున తాము పోరాడుతూనే ఉంటామన్నారు. అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సరిపడా నిధులు ఇవ్వడం లేదని, రాజస్థాన్, గుజరాత్‌కు సమంగా ఏపీలోనూ జనాభా ఉన్నారని, కానీ అక్కడి మెడికల్ కాలేజీలకు లభిస్తున్న అనుమతులతో పోలిస్తే.. ఇక్కడ అనుమతులు రావడం లేదన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ మెడికల్ కళాశాలల ప్రస్తావన తక్కువగా ఉంది. గుజరాత్, రాజస్థాన్ తరహాలో ఏపీకి మెడికల్ కాలేజీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్‌కి తలను తీసేశారు...మద్రాసు రాష్ట్రం నుంచీ ఇలా జరుగుతూనే వస్తోంది. తీసేసిన తలకు మళ్లీ జీవం పోయాల్సిన బాధ్యత కేంద్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఉంది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వబోమని చెప్పి ఇచ్చారు కదా..అలానే తాము కూడా హోదా ఇచ్చే వరకూ పోరాడతామన్నారు. రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జరిగిన తీవ్ర నష్టాన్ని సరిదిద్దాలని తాము కోరుతున్నామన్నారు. వీటన్నింటి గురించి మాట్లాడేందుకే తాము ప్రైవేటు మెంబర్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామన్నారు. పార్లమెంటులో ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైతే సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని ప్రధాని గమనించాలని కోరారు. ఇప్పటికే రాజకీయ పార్టీలపై ప్రజల్లో విశ్వాసం తగ్గిపోతోందని, విభజన తర్వాత ఏపీ ప్రజల మనసులు గాయపడ్డాయన్నారు. దానికి విభజన చట్టం వల్ల కొంత ఊరట వచ్చిందని అనుకున్నాం. కానీ దానిలోని అంశాలు ఎనిమిదేళ్లు దాటినా అమలు కాకపోతే ఫలితం ఏముందని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి ఇప్పటికైనా దీనిపై దృష్టి పెట్టాలని వారు కోరారు.

కృష్ణా కొత్త ట్రిబ్యునల్ మరింత ఆలస్యం

అభిప్రాయం వెల్లడికి అటార్నీ జనరల్ విముఖత

సొలిసిటర్ జనరల్ వద్దకు చేరిన ఫైల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కృష్ణా కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అసలు కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలా ? వద్దా ? అనే దానిపై అభిప్రాయం తెలిపేందుకు అటార్నీ జనరల్ వెంకట రమణ నిరాకరించారు. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుపై అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వం గతంలోనే కోరింది. అయితే ఏజీగా ఆయన బాధ్యతలు చేపట్టకముందు, సీనియర్ న్యాయవాదిగా ఏపీ ప్రభుత్వం తరపున కొన్ని కేసుల్లో హాజరైనందున తన అభిప్రాయాన్ని చెప్పలేనని స్పష్టం చేశారు. దీంతో ఆ ఫైల్‌ను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు ఆ దస్త్రాన్ని పంపింది. రాష్ట్ర విభజన తర్వాత తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ డిమాండ్ చేస్తున్న విషయం తెల్సిందే. ఆ తర్వాతే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేయాలని సుప్రీంకోర్టులో తెలంగాణ పిటీషన్ దాఖలు చేసింది. తెలంగాణ పిటిషన్ ఉపసంహరించుకుంటే, కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రం అనేకసార్లు చెప్పింది. ఆ మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని తొలుత కేంద్ర న్యాయశాఖ అభిప్రాయాన్ని వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌తోనే విచారిస్తే సరిపోతుందని అభిప్రాయపడింది. దీనిపై అటార్నీ జనరల్ అభిప్రాయం ప్రకారం ముందుకెళ్లాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఏజీ అభిప్రాయాన్ని కోరగా, ఏజీ విముఖత చూపడంతో ఆ దస్త్రాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు కేంద్రం పంపింది. తుషార్ మెహతా అభిప్రాయం తర్వాత కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుపై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఎస్సీ ఎస్టీలకు బడ్జెట్ నిరాశాజనకం: చిట్టిబాబు

విశాలాంధ్ర-విజయవాడ: సమ్మిళిత అభివృద్ధి అని ఎంతో ఆర్భాటంగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ, ఎస్టీలకు నిరాశాజనకంగా ఉందని దళిత బహుజన శ్రామిక యూనియన్ (డీబీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు అన్నారు. దళిత ఆర్థిక అధికార ఆందోళన ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దళిత ఆదివాసి బడ్జెట్ విశ్లేషణ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 2023-24 వార్షిక బడ్జెట్‌లో జాదేవు కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎస్సీలకు 2,03,991 కోట్లు కేటాయించాల్సి ఉండగా, 1,59,126.22 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు 115672 కోట్లు కేటాయించాల్సిఉండగా, రూ.1,19,509.87 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఈ కేటాయించిన నిధులలో గణనీయమైన భాగం ఈ వర్గాల అత్యవసర, నిర్దిష్ట అవసరాలను విస్మరిస్తూ అసంబద్ధమైన, సాధారణ పథకాలకు మళ్లిస్తున్నట్లు విమర్శించారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధి చేయటం కోసం రాజ్యాంగ నిర్దేశించిన విధంగా సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తారనీ, అయితే తామే ఇస్తున్నట్లు పాలకులు ప్రచారం చేసుకోవడం విచారకరమన్నారు. ఇప్పటికీ ఊరు-పల్లె అనే వివక్షత కొనసాగుతోదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా దేశంలో దళిత, గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేసీహెచ్ బంగారు రాజు, కోలారాణి, ఆంధ్రప్రదేశ్ రెల్లి కుల సంక్షేమ సంఘం ప్రతినిధి శీరంశెట్టి నాగేంద్రరావు తదితరులు మాట్లాడారు.

తగిన బుద్ధి చెపుతాం

(మొదటిపేజీ తరువాయి)

భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 11వ పీఆర్సీ ప్రకటించినప్పుడు అరియర్స్‌ను 2022 ఏప్రిల్‌కు చెల్లిస్తామని, డీఏ బకాయిలను సంపూర్ణంగా ఇస్తామని ఓపిక పట్టాలని ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. మాట తప్పను, మడమ తిప్పను అని చాలా గొప్పగా చెప్పిన సీఎం ఉద్యోగులను, ఉద్యోగ సంఘాలను, కార్మికులను అందరినీ పక్కాగా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ సంఘాలను రెచ్చగొట్టి వారి మధ్య అనైక్యత, విభేదాలను సృష్టించి చరిత్రాత్మక ఆందోళనను పక్కదారి పటిస్తున్నారనీ, ఇది సరైన పద్ధతికాదని ఓబులేసు హెచ్చరించారు. గవర్నర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వెళ్లిన సూర్యనారాయణని బెదిరించి యూనియన్ గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నిస్తూ బెదిరింపులకు దిగటం ఏ మాత్రం తగదన్నారు. కరోనా మహమ్మారి వల్ల ఉద్యోగులకు మధ్యంతర భృతి కంటే తక్కువగా పీఆర్సీ ఫిట్మెంట్ ఇవ్వడం దారుణం అన్నారు. కొత్త పెన్షన్ రద్దు కోరుతూ పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనను అరెస్టుల ద్వారా అడ్డుకోవడం మూర్ఖత్వం అన్నారు. జగన్ ఇప్పటికైనా ఉద్యోగులతో సామరస్యంగా మెలగాలని లేదంటే రానున్న రోజుల్లో మరో తీవ్ర ఉద్యమానికి సమాయత్తం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి సంవత్సరం గడిచిపోతున్నా ప్రభుత్వ వైఖరిలో మార్పు లేకపోగా సమస్యలను జఠిలం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీటీఎఫ్ కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రభుత్వం దగా చేసిందని ఉపాధ్యాయులందరూ కలిసి ప్రభుత్వంతో తాడోపెడో తేల్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాలయ్య మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ అరియర్స్ బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిద్ధార్థ మెడికల్ కాలేజ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వెంకటరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో పెన్షనర్లు చాలా ఇబ్బందులు గురవుతున్నారని వారి సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్‌ల యూనియన్ జాతీయ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం జీపీఎఫ్ సొమ్మును వాడుకోవడం దుర్మార్గమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వానికి గత ఏడాది ఇదే రోజు కార్మిక వర్గం గట్టి గుణపాఠం చెప్పిందని మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కేవీఎస్ రవి, విజయవాడ నగర ఏఐటీయూసీ కార్యదర్శి ఎం సాంబశివరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ.రంగనాయకులు, కోట మాల్యాద్రి, కేఆర్ ఆంజనేయులు శ్రామిక మహిళా సంఘం నాయకులు లక్ష్మీదేవి, శైలజ, ఏఐటీయూసీ నగర నాయకులు వియ్యపు నాగేశ్వరరావు, టీ తాతయ్య, గుంటూరు నాయకులు అరుణ్ కుమార్, చల్లా వెంకటరమణ, ఉమర్ వల్లి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లో ధాన్యం... కష్టాల్లో రైతాంగం

(మొదటిపేజీ తరువాయి)

అధిగమించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు కొంతమేర ఫలించాయనే చెప్పాలి. ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ సంక్రాంతి నాటికి సుమారు 2.64 లక్షల టన్నులను సేకరించారు. మొత్తం లక్ష్యంలో రెండవ వంతు సేకరణ, వాటికి చెల్లింపులను పూర్తి చేశారు. అయితే ఇంకా లక్షల టన్నుల వరకు ధాన్యం సేకరించకుండా రైతుల వద్ద ఉండిపోయింది. దీంతో ఆయా రైతులంతా తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. ఇటీవల భోగాపురంలో పెద్ద ఎత్తున రైతులు ఆందోళనకు దిగారు. పంటలో 50 శాతం కూడా కొనుగోలు చేయకుండా లక్ష్యం పూర్తయిందంటూ అధికారులు చెప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు కల్పించుకుని సమస్యను కొలిక్కి తీసుకువచ్చారు. పండిన ప్రతి గింజ కొంటామన్న ప్రభుత్వ హామీకి, క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉండడమే రైతుల ఆగ్రహానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేపట్టడంతో 100 టన్నులు కొనుగోలు చేస్తామనే హామీ లభించింది. ఇంకా భోగాపురంలో 500 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. వేపాడ మండలంలో కూడా దాదాపు ఇటువంటి పరిస్థితే ఉంది. మొత్తం 16,571 మెట్రిక్ టన్నుల ధాన్యంలో 8,132 టన్నులు సేకరించగా, రైతులు సొంతానికి, బయట అమ్మకాలకు 4,939 టన్నులు పోగా, ఇంకా కొనుగోలు చేయవలసింది 3,500 మెట్రిక్ టన్నుల వరకు ఉంది. అయితే జిల్లాలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని చెప్పిన తర్వాత వ్యవసాయ అధికారులు రైతుల కల్లాల్లో రైతులతో ధాన్యం నిల్వ ఉన్న ఫొటోలతో పీపీసీ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయడంతో మరలా 1801 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం రైతులు దగ్గర 1,699 మెట్రిక్ టన్నులు ధాన్యం నిల్వ ఉంది. దత్తిరాజేరు మండలంలోని రైతాంగం పరిస్థితి దారుణంగా ఉంది. రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొంటుందని ప్రకటించినప్పటికీ అది పేపర్ల ప్రకటనకే తప్ప అమలు కాలేదు. ఈ-క్రాప్ అయిన రైతులందరి ధాన్యం సేకరిస్తున్నామన్నా, నేటికీ ఆ దిశగా ప్రయత్నం జరగలేదు. అలాగే గత 20 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు లేక కల్లాల్లోనే నిల్వలు ఉండిపోవడం వలన క్వింటా రూ.1,700 అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 5,000 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. పొలాల్లో ఎక్కడ చూసినా ధాన్యం బస్తాలు నెట్లు వేసి ఉన్నాయి. అయితే మండలంలో అధికారులు మాత్రం 75 శాతం ధాన్యం కొనుగోలు చేశామని చెబుతున్నారు.

రైతుల పరిస్థితులను ఆసరాగా తీసుకుని దళారుల తక్కువ ధర చెల్లించినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు నష్టానికే ధాన్యం అమ్ముకుంటున్నారు. గుర్ల మండలంలో 85 శాతం ధాన్యం కొనుగోలు చేపట్టారు. 42 పంచాయతీల పరిధిలో గ్రామానికి సుమారుగా 50 మంది రైతులు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచారు. ఎలుకలు బెడద ఎక్కువగా ఉండడంతో ధాన్యం బస్తాలు చిరిగి పోయి ధాన్యం నేలపాలు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో సుమారు లక్ష టన్నుల వరకు ధాన్యం సేకరించారు. అందులో సగం వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది. నడుపురు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు చేసి తమ కష్టాలు తీర్చాలని రైతులు కోరుకుంటున్నారు.

రోడ్డెక్కిన వీధి వ్యాపారులు

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు అధికారులను ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో చిరువ్యాపారుల పొట్ట కొట్టవద్దని, వారి జీవనాన్ని చిన్నాభిన్నం చేయొద్దని కోరారు. మార్చి 3,4 తేదీల్లో విశాఖలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు, 28, 28 తేదీల్లో జీ 20 సదస్సులు జరగనున్నాయి. వివిధ దేశాల నుండి పెట్టుబడిదారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు నగరానికి వస్తున్నారనే నెపంతో తోపుడుబండ్లు, చిరువ్యాపారులను జీవీఎంసీ అధికారులు అన్యాయంగా తొలగించడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని, ఎక్కడ వారికి అక్కడే ఉపాధి కల్పించాలని విశాఖపట్నం వీధి విక్రయదారుల కార్మిక సంఘాలు శుక్రవారం జీవీఎంసీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేపట్టాయి. అనంతరం జీవీఎంసీ కమిషనర్ రాజబాబుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. పొట్టచేతపట్టుకొని విశాఖ నగరానికి వలస వచ్చిన అత్యధికమంది స్వయం ఉపాధితో బతుకుతున్నారు. వీధి విక్రయదారులకు, చిరువ్యాపారులకు ఉపాధి కల్పించాలని కేంద్రం చట్టం చేసింది. వీరికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని సుప్రీంకోర్టు సైతం మార్గదర్శకాలు విడుదల చేసింది. కానీ విశాఖలో పోలీసులు, జీవీఎంసీ అధికారులు దౌర్జన్యంగా చిరువ్యాపారులపై దాడులు చేసి దుకాణాలు తొలగిస్తున్నారు. దీనివలన 10 వేల కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. జి-20, పెట్టుబడిదారుల సదస్సులు చిరువ్యాపారులకు శాపంగా ఉండకూడదని, జీవీఎంసీ కమిషనర్ జోక్యం చేసుకొని తొలగించిన బడ్డీలు, తోపుడుబండ్లను పెట్టించాలని విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మికసంఘం నేతలు డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, వీధివిక్రయదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం, నాయకులు ఎం.సుబ్బారావు, భీంపల్లి రాము, జక్కన్ నరసింహామూర్తి తదితరులు కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు.

బడ్జెట్‌పై 13న సీపీఐ నిరసన

(మొదటిపేజీ తరువాయి)

వెలువరించింది. విలేకరుల సమావేశాలు, పోస్టర్లు, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించింది. తమ ఉద్యమంలో కలిసి రావాలని అన్ని పార్టీలు, భావసారూప్యతగల వ్యక్తులకు సీపీఐ విన్నవించింది. కలిసికట్టుగా అదానీ, కేంద్రప్రభుత్వ బండారం బట్టబయలు చేద్దామంటూ లౌకిక, ప్రజాస్వామిక, వామపక్ష పార్టీలకు పిలుపునిచ్చింది.

రెండున్నర లక్షల ఉద్యోగాలిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో తమ ఎన్నికల ప్రణాళికను విడుదల చేశారు. 2018లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందని నారాయణ్ కర్ విమర్శించారు. బీజేపీ-ఐపీఎఫ్‌టీ పాలనలో ప్రజల ఓటు హక్కును లాగేసుకున్నారని మండిపడ్డారు. ప్రజలు గొంతెత్తి మాట్లాడే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఎన్నికల్లో గెలిస్తే ప్రజాస్వామ్య విలువలను లెఫ్ట్‌ఫ్రంట్ పునరుద్ధరిస్తుందని హామీ ఇచ్చారు. లెఫ్ట్‌ఫ్రంట్‌ను ప్రజలు ఆశీర్వదిస్తే రానున్న ఐదేళ్లలో 2.5 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. మార్గదర్శకాలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామన్నారు. 60 ఏళ్లు పైబడిన...ఆదాయం లక్ష రూపాయల కన్నా తక్కువ గల వృద్ధులకు సామాజిక పెన్షన్ ఇస్తామన్నారు. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఏడాదికి రెండుసార్లు ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం(డీఏ) పెంచుతామని కర్ హామీ ఇచ్చారు. త్రిపురలో 1,88,494 మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా పేదలకు ఏడాదికి 200 రోజులు పనికల్పిస్తామని ఆయన చెప్పారు. త్రిపుర గిరిజన ప్రాంతాల స్వయంప్రతిపత్తి జిల్లా మండలి(టీటీఏఏడీసీ)కి అత్యున్నతస్థాయి స్వయంప్రతిపత్తి కల్పిస్తామని స్పష్టంచేశారు. అవినీతి రహిత, ప్రజలకు స్నేహపూర్వక ప్రభుత్వం అందించడానికి లెఫ్ట్‌ఫ్రంట్ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నందున త్వరలోనే కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ప్రకటిస్తామని చెప్పారు.

త్రిపురలో సీపీఎం 43 సీట్లలో పోటీ చేస్తుండగా మిత్రపక్షాలు-సీపీఐ, ఫార్వర్డు బ్లాక్, ఆర్ఎస్‌పీ ఒక్కో సీటులో పోటీకి దిగుతున్నాయి. రామ్‌నగర్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థికి లెఫ్ట్‌ఫ్రంట్ మద్దతిస్తోంది. లెఫ్ట్‌ఫ్రంట్‌తో సీట్ల పంపిణీ ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్ 13 సీట్లలో పోటీ చేస్తోంది. 60 స్థానాలు గల త్రిపుర అసెంబ్లీకి ఫిబ్రవరి 16న పోలింగ్ జరుగుతుంది. మార్చి 2న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

అదానీపై చర్చకు నో

(మొదటిపేజీ తరువాయి)

ఉభయసభలు హోరెత్తాయి. సభా కార్యకలాపాలు సజావుగా సాగనివ్వాలన్న స్పీకర్ ఓం బిర్లా సూచనలను ప్రతిపక్ష సభ్యులు పట్టించుకోకుండా నినాదాలు కొనసాగించడంతో లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఆ తర్వాత సమావేశమైనప్పుడు విపక్షాల ఆందోళన-నినాదాలు కొనసాగాయి. నిరసన హోరులోనే పార్లమెంటరీ పత్రాల సమర్పణకు సభాపతిగా ఉన్న రాజేంద్ర అగర్వాల్ ఆదేశాలిచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను జరగనివ్వాలని విపక్ష సభ్యులను కోరారు. తమ డిమాండ్‌పై ప్రతిపక్ష సభ్యులు నిరసన కొనసాగించడంతో లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. అదే విధంగా రాజ్యసభలోనూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేయడంతో చైర్మన్ జగదీప్ ధన్కర్ అసహనం వ్యక్తంచేస్తూ సభను సోమవారానికి వాయిదా వేశారు.

'6వ తేదీ ఉదయం 11 గంటలకు సభ తిరిగి సమావేశమవుతుందని ప్రకటించిన ఆయన వెల్‌లోకి వెళ్లి సభ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తొలుత మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదాపడి 2.30 గంటలకు తిరిగి సమావేశైంది. ప్రైవేటు సభ్యుల బిల్లులను ప్రవేశపెట్టాలని ధన్కర్ చెప్పారు. అయితే విపక్షాల నిరసన కొనసాగడంతో సభ కార్యకలాపాలు ముందుకు సాగలేదు. అదానీ గ్రూపు వ్యవహారంలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సమర్పించిన 15 వాయిదా తీర్మానాలను సభ మొదలైనప్పుడు ధన్కర్ తిరస్కరించారు. '267 నిబంధన కింద వివిధ సభ్యుల నుంచి 15 నోటీసులు అందాయి. అన్నింటిని పరిశీలించాను. అవి 267 నిబంధనకు తగ్గట్లుగా లేనందున తిరస్కరిస్తున్నా' అని చెప్పారు.

దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనికి ధన్కర్ స్పందిస్తూ 'మీరు మీ పనిచేశారు.. నేను చేయాల్సినది నేను చేశా'నని బదులిచ్చారు. కాగా నోటీసులు అందజేసిన ఎంపీల్లో మల్లికార్జున ఖడ్గే, సీపీఐ సభ్యులు పి.సంతోశ్ కుమార్, ఎలామరం కరీం, సయ్యద్ నజీర్ హుస్సేన్, ప్రమోద్ తివారీ, కుమార్ కేట్కర్, అమీ యాజ్ఞిక్, నీరజ్ దంగీ, జాన్ బ్రిట్టాస్, ఏఏ రహీం, వి.శివదాసన్, తిరుచీ శివ, కె.కేశవరావ్, సంజయ్ సింగ్, ప్రియాంక చతుర్వేది ఉన్నారు.

ఎంతైనా ఖర్చు చేస్తాం

- రాష్ట్ర ప్రతిష్ఠ పెంచే జగనన్న విదేశీ విద్యాదీవెన
- ముఖ్యమంత్రి జగన్
- 213 మంది విద్యార్థులకు రూ.19.95 కోట్లు జమ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదల తలరాతలు మార్చే శక్తి ఒక్క విద్యకే ఉందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. అందుకే మానవ వనరులపై పెట్టుబడికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. విద్యా రంగంపై ఖర్చు చేసే ప్రతి రూపాయి మానవ వనరులపై పెడుతున్నట్టేనని, దీనివల్ల వారి కుటుంబాల తలరాతలు మారడమే కాకుండా రాష్ట్రంలో ప్రతి ఒక్కరి తలరాత మార్చే గొప్ప పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రపంచంలోని ఉత్తమ యూనివర్సిటీలలో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థికసాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ ఏడాది టాప్ 200 విదేశీ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లను శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్ మీటనొక్కి విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడితో ఇంకా ఉన్నతస్థానంలోకి వెళ్లాలని ఆకాంక్షించారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. అప్పుడే రాష్ట్రం ప్రతిష్ఠ దేశ, విదేశాల్లో పెరుగుతుందన్నారు.



దాదాపు రూ.1.16 కోట్ల ఫీజుతో కార్నిగీ మిలన్ యూనివర్సిటీ, రూ.కోటి ఫీజుతో యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, మాస్టర్స్ ఇన్ హెల్త్ ఇన్‌ఫర్మేటిక్స్, బోస్టన్ యూనివర్సిటీ, రూ.97 లక్షల ఫీజు, రూ.88.70 లక్షల ఫీజుతో హార్వర్డ్ యూనివర్సిటీ వీటన్నింటిని చూస్తుంటే... పేదలు, సామాన్యులు ఎవరూ ఇంత ప్రతిభ ఉండి, ఇటువంటి చోట సీటు వచ్చినా, డబ్బులు కట్టలేక, వాటి గురించి ఆలోచించడానికే భయపడే పరిస్థితి నెలకొంది న్నారు. అటువంటి పరిస్థితుల్లో విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికీ, మంచి యూనివర్సిటీలో సీటు వస్తే.. డబ్బులు లేక వెనకడుగు వేసే పరిస్థితి రాకూడదన్న ఆలోచన నుంచి ఈ పథకం వచ్చిందని సీఎం వివరించారు. 100 నుంచి 200 వరకు క్యూఎస్ ర్యాంకులు పొందినవాళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100 శాతంతో రూ.75 లక్షల వరకు ఇస్తున్నామన్నారు. మొదటి సెమిస్టర్ ఫలితాల తర్వాత రెండో విడత ఇస్తామన్నారు. రెండో సెమిస్టర్ తర్వాత మూడో విడత, విజయవంతంగా నాలుగో సెమిస్టర్ పూర్తి చేసి మార్క్స్‌షీట్ అప్‌లోడ్ చేసిన తర్వాత తుది చెల్లింపు ఉంటుందన్నారు. రూ.8 లక్షల ఆదాయం ఉన్న ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తింపజేస్తామన్నారు. రెండు సీజన్లలోనూ వచ్చే అడ్మిషన్లు ప్రోత్సహిస్తూ, వాళ్లను కూడా ఈ జాబితాలో చేరుస్తున్నామన్నారు.

'మీకు ఎలాంటి సమస్య ఉన్నా.. వెంటనే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాం. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక ఐఏఎస్ అధికారిని ఈ పనికోసం కేటాయిస్తున్నాం. మీకు ఏ సమస్య ఉన్నా ఒక్క ఫోన్ కాల్ చేసి... వెంటనే సహాయం తీసుకోవచ్చు. ప్రతి విషయంలోనూ మీకు తోడుగా ఉంటాం. తద్వారా మీరు ఉన్నతస్థాయికి చేరుకుని మీ కుటుంబంతో పాటు రాష్ట్రానికీ గర్వకారణంగా నిలబడాలి' అని సీఎం అన్నారు. ఉపముఖ్యమంత్రి (మైనార్టీ సంక్షేమం) షేక్ అంజాద్ బాషా, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బి.జయలక్ష్మి, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఎండీ జి .రేఖారాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నట్టేట ముంచిన జగన్

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- సభకు అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు
- బంగారుపాళ్యంలో కొంతసేపు ఉద్రిక్తత

విశాలాంధ్ర-బంగారుపాళ్యం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌కు ఒక్క అవకాశం ఇచ్చినందుకు ఆయన రాష్ట్రాన్ని నట్టేట ముంచాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాద యాత్రలో భాగంగా శుక్రవారం బంగారుపాళ్యం మండలంలోని మొగిలి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. గాండ్ల పల్లె, బలిజ పల్లె, పాలమాకుల పల్లె మీదుగా శేషాపురం గ్రామం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని, అక్కడ మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. పాదయాత్ర మొగిలి వెంకటగిరి వద్ద భోజన విరామం అనంతరం తిరిగి ప్రారంభమై బంగారుపాళ్యంకు చేరుకుంది. ముస్లిం సోదరులు జామియా మసీదు లోపలికి ఆహ్వానించి నారా లోకేశ్‌ను సత్కరించారు. అనంతరం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్దకు చేరుకొని బహిరంగ సభలో ప్రసంగించేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి... నారా లోకేశ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బహిరంగ సభ జరిపేందుకు అనుమతి లేని పోలీసులు తెలియజేయగా, జరిపి తీరుతామని లోకేశ్ భీష్మించుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం పక్కనే ఉన్న టీడీపీ నాయకులకు చెందిన భవనం పై నుంచి నారా లోకేశ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధాలకు ప్యాంటు, షర్టు వేస్తే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అవుతారన్నారు. ఈయన నేతృత్వంలో జిల్లాకో మాఫియా లీడర్‌ను తయారు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. బినామీలతో అనేక అక్రమ మార్గాలలో ధన సంపాదన ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఆరోపించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు పెద్దిరెడ్డికి తొత్తుగా వ్యవహరిస్తూ బినామీగా మారిపోయారన్నారు. వీరి అవినీతికి అంతే లేకుండా పోయిందని అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన కాణిపాకం ఆలయం అభివృద్ధి పనులలోను వీరు చేతివాటం ప్రదర్శించడం దారుణమని తెలిపారు. రాబోయే రోజులలో టీడీపీని ఆదరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులకు చెందిన సౌండ్ సెట్లు అమర్చిన వాహనాలను సీజ్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వివాదం చెలరేగింది. సుమారు రెండు గంటల పాటు పోలీసులకు, టీడీపీ నాయకులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న తమను అడ్డుకోవడం ఎంతవరకు సబబు అని మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి పోలీసులకు పదే పదే విజ్ఞప్తి చేసిన చాలా సమయానికి పాదయాత్ర ముందుకు వెళ్లింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.పి.జయ ప్రకాష్, కార్యదర్శి జనార్దన్, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ హేమచంద్ర నాయుడు, నాగరాజ గౌడ్, తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, లోకనాథ నాయుడు, నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటినుంచి ఏపీ అమరావతి జేఏసీ రాష్ట్ర మహాసభలు

జయప్రదానికి బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఏపీ అమరావతి జేఏసీ 3వ రాష్ట్ర మహాసభలు శని, ఆదివారాలు కర్నూల్ నగరంలో జరగనున్నాయి. వీటిని జయప్రదం చేయాలని ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ మహాసభలు కర్నూలు నగర శివారులోని జీఆర్‌సీ ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ తేదీన నూతన కమిటీ ఎన్నికలకు నామి నేషన్ ప్రక్రియ, 5న మహాసభ జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 96 సంఘాల నాయకులు సుమారు 10వేల మంది హాజరవుతారని చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి సంబంధించి చర్చించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని చెప్పారు. నూతన కమిటీ ఎన్నికల అధికారిగా భావన రుషి, సహాయ అధికారిగా పీవీ కృష్ణారావు ఉంటారని వెంకటేశ్వర్లు తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో విజయవాడలో నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, ఒప్పంద కార్మికుల ఉద్యమం చరిత్రాత్మకమైందని గుర్తుచేస్తూ తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం హామీనిచ్చి ఏడాది గడిచినా ఆచరణ శూన్యమని చెప్పారు. తమ డిమాండ్లపై మహాసభ తీర్మానిస్తుందని అన్నారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి జేవీ రావు, అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణివీర్రాజు, జేఏసీ కోశాధికారి మురళీకృష్ణ నాయుడు, జేఏసీ కో చైర్మన్ కె.మల్లేశ్వరరావు, ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లిశెట్టి దామోదరావు, మద్దిలేటి, జేఏసీ నాయకులు ఈర్ల శ్రీరాములు, వెంకట్రావు, ఆంజనేయులు, సాంబశివరావు, గిరికుమార్‌రెడ్డి, శోభ పాల్గొన్నారు.

8న ఆర్డీఓ కార్యాలయాల ముట్టడి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతల వెల్లడి

విశాలాంధ్ర- తిరుపతి: మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు 'ఫేస్ రికగ్నైజెడ్ సిస్టం' విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీవో కార్యాలయాల ముట్టడిని చేపడుతున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బ రాయుడు, గౌరవ సలహాదారు తులసేంద్ర వెల్లడించారు. శుక్రవారం స్థానిక తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు గత జులైలో జరిగిన సమ్మెలో రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్స్ మినిట్స్‌ను అందివ్వడం లేదన్నారు. నూతన 12వ పీఆర్సీలో ధరల కనుగుణంగా వేతనాల పెంపుకై పోరాడకుండా కట్టడి చేసేందుకు 4 మార్లు 'ఫేస్ రికగ్నైజెడ్ సిస్టం' తేవడం దుర్మార్గమన్నారు. కార్మికులు తమ భవిష్యత్ నిధి దాచుకుంటే వాటిని అందివ్వకుండా, పుట్టినతేదీలు సరిగా లేవంటూ కార్మికుల ఖాతాల్లో జమ జేయకుండా ప్రతీ దానికి విజయవాడ అప్కాస్ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని విమర్శించారు. తిరుపతిలో 36 మంది కార్మికులకు సాంకేతిక లోపాలు చూపుతూ వేతనాలు, అలవెన్సులు చెల్లించడం లేదన్నారు. కానీ వీరికి సంబంధించి వేతనాలు చెల్లింపులకు కమీషన్ మాత్రం అప్కాస్ సంస్థ వారు ప్రతినెలా తీసుకుంటున్నారన్నారు. చనిపోయిన, పదవీవిరమణ పొందిన కార్మికుల వారి కుటుంబ సభ్యులకు తిరిగి పనులు కల్పించడానికి కమిషనర్లు, ఆయా జిల్లాల కలెక్టర్లు అప్కాస్‌కు రెఫర్ చేసినా ఈ ప్రయివేట్ కంపెనీ... వారికి పనులు కల్పించడానికి తీవ్ర జాప్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దశలో దశల వారి పోరాటానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పూనుకుందని ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి8 ఆర్డీఓ కార్యాలయాల ముట్టడి అనంతరం ఫిబ్రవరి 15న టూల్ డౌన్ సమ్మె చేపడతామని వారు హెచ్చరించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగ, కార్మికులు , డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి కార్మికుల సమస్యల సాధనకు ఫిబ్రవరి 5న విజయవాడ నందలి గొల్లపూడిలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల నుండి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో నగర కార్యదర్శి దొరస్వామి, ఉపాధ్యక్షుడు మదన్ మోహన్, కోశాధికారి గురవయ్య పాల్గొన్నారు.

డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరుగుతున్న 74వ జాతీయ మానసిక వైద్యుల వార్షిక సమావేశంలో భాగంగా ఇండ్ల హాస్పిటల్స్ డైరెక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి 2022-23కుగాను జాతీయ స్థాయిలో డాక్టర్ జె.కె. త్రివేది లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందజేశారు. విజయవాడకు చెందిన డాక్టర్ రామసుబ్బారెడ్డి నాలుగు దశాబ్దాలకుపైగా మానసిక వైద్య రంగంలో గణనీయమైన సేవలు అందిస్తున్నారు. మానసిక వ్యాధులకు సంబంధించి మూఢ నమ్మకాలు, అపోహలను తొలగించి, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఎన్నో పుస్తకాలు రాశారు. తెలంగాణలో బాణామతి, చేతబడి వంటివి తొలగించేందుకు ఆ ప్రాంతాల్లో అనేకమార్లు పర్యటించారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వినయకుమార్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఎన్.రాజు ఇతర అతిధులు డాక్టర్ రామసుబ్బారెడ్డిని ఈ అవార్డుతో సత్కరించారు. దేశంలోని వైద్య, ఇతర రంగాల ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అంతర్రాష్ట్ర వివాదాలు పెంచే కుట్ర

అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయింపులపై శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు రు.5,300 కోట్లు కేటాయించడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం అంతర్రాష్ట్ర వివాదాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందాలనే కుట్రపూరిత వైఖరిని శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. బడ్జెట్ ప్రసంగంలో అప్పర్‌భద్రకు కేటాయింపులు ప్రకటించిన అనంతరం కృష్ణా, తుంగభద్ర ఆయకట్టులోగల ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టులకు నీటి లభ్యత విషయమై ప్రజల్లో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే తుంగభద్ర ఎగువ- దిగువ కాలువలు, ఆర్డీఎస్‌ఎస్, కేసీ కెనాల్ ఆయకట్టులకు నీరందక పంటలు ఎండిపోవడం, కాలువ చివర ప్రాంతాలు బీడుగా మిగిలిపోతున్న నేపథ్యంలో కరువు పీడిత రాయలసీమ ప్రజలు కేంద్ర ప్రభుత్వ ప్రకటనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలు సైతం కేంద్రం పట్టించుకోకుండా కర్ణాటక ఎన్నికల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను దెబ్బతీయడం గర్హనీయం. నదీజలాల ట్రిబ్యునళ్లు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు కేటాయించిన నీటి వాటాను రక్షించుకునే బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉంది. ఇందుకోసం కేంద్రంతో చర్చించాలి. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడానికి తగు చర్యలను తక్షణమే చేపట్టాలని శ్రీనివాసరావు సూచించారు.

సీపీఎస్ రద్దు చేయకపోతే మరో ఉద్యమం తప్పదు

ఓపీఎస్ సాధన దీక్షలో ఎస్టీయూ నాయకుల పునరుద్ఘాటన

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌ను రోడ్డుపాలు చేసేలా 2004 సెప్టెంబర్ నుంచి అమలులోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న స్పష్టం చేశారు. ఎస్టీయూ అధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట జరిగిన 'ఓపీఎస్ సాధన దీక్ష'లో సాయిశ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడుతూ 30 ఏళ్లు పైబడి ప్రజలకు, ప్రభుత్వానికి సేవ చేసి, పదవీ విరమణ అనంతరం సర్వీసులో ఉండగా మరణించిన సందర్భంలో ఏ విధమైన భద్రత, భరోసా లేకుండా చేసిన ఈ 'సీపీఎస్'ను రద్దు చేయాలని దశాబ్ద కాలంగా చేస్తున్న పోరాటాలు, ప్రాతినిధ్యాలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గకరమన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర మొదలు పెట్టిన ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రతిచోట అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. తీరా ప్రభుత్వాన్ని ఏర్పరచి, ముఖ్యమంత్రి హోదాలో సీపీఎస్‌ను రద్దు చేయకుండా కమిటీల మీద కమిటీలు వేసి, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో అనేక దఫాలుగా చర్చలు జరపడం, ఏ విధమైన గ్యారంటీ లేని గ్యారంటీ పెన్షన్ స్కీమ్ అంటూ కొత్త ప్రతిపాదనలను మంత్రివర్గ ఉప సంఘం తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఓపీఎస్ సాధన దీక్షకు సంఘీభావంగా విచ్చేసిన పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు మాట్లాడుతూ మనకంటే తక్కువ బడ్జెట్ ఉండే ఎలాంటి హామీ ఇవ్వని రాజస్థాన్, చత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే, స్పష్టమైన హామీ ఇచ్చిన మన ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాన్ని మోసగించే రీతిలో ఉండడం తగదన్నారు. అన్ని స్థాయిల్లో ప్రాతినిధ్యాలు, పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. అలాగే విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను భయాందోళనలకు గురిచేస్తూ, వారిని మానసికంగా వేధించడం మానుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాలు పునరుద్ధరించిన విధంగా ఆంధ్రప్రదేశ్ కూడా ఆలోచన చేసి, వచ్చే బడ్జెట్ సమావేశాలలోనే సీపీఎస్ రద్దు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టడానికి కూడా వెనుకాడ బోమన్నారు. సంవత్సర కాలం నుంచి పేరుకుపోయి, పెండింగ్‌లో ఉన్న జడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అన్యాయమన్నారు. వెంటనే బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టకపోతే మరో ఉద్యమం చేపట్టక తప్పదన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, తిమ్మన్న, రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి, బాలగంగిరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, నరసింహులు, అబ్దుల్ వాజీద్ తదితరులు దీక్షలో కూర్చొని, మధ్యాహ్నం నిమ్మరసంతో దీక్ష విరమించారు. వందలాది మంది ఉపాధ్యాయులు, ఎస్టీయూ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి సీపీఎస్ రద్దు నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, గంటా మోహన్, చంద్రశేఖర్, ఇలియాస్ బాషా, నాగరాజు, కడప, అన్నమయ్య, కర్నూలు, అనంతపురం, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, సునీల్ కుమార్, గోకారి, జనార్ధన్, సూర్యుడు, రమణారెడ్డి, అజాంబేగ్, మౌలాలి, దేవరాజులరెడ్డి, మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, సీపీఎస్ ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



అమరావతిలో శ్రీలక్ష్మి పర్యటన

విశాలాంధ్ర-మంగళగిరి: రాజధాని అమరావతి గ్రామాలు రాయపూడి, మల్కాపురం, కురగల్లులో మున్సిపల్ శాఖ ప్రత్యేక సీఎస్ వై.శ్రీలక్ష్మి శుక్రవారం పర్యటించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు స్థానికంగా నిర్మాణమవుతున్న అనేక పైలట్ ప్రాజెక్టుల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, ఉన్నత ప్రమాణాలతో నిర్మాణం పూర్తి చేసిన, పూర్తయిన ఇ-హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలను శ్రీలక్ష్మి సందర్శించారు. శ్రీలక్ష్మితో వెంట ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఉన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాల నాణ్యతా ప్రమాణాలపై సీఆర్‌డీఏ అధికారులు, కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు శ్రీలక్ష్మి సూచనలు చేశారు. అనంతరం శ్రీలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 100 స్మార్ట్ నగరాలలో అమరావతి ఒకటని తెలిపారు. స్మార్ట్ అండ్ సస్టైనబుల్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ కింద అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని, ఈ పైలట్ ప్రాజెక్టులకు ఫ్రెంచ్ అభివృద్ధి సంస్థ, యూరోపియన్ల మద్దతు, ఆర్థిక సహకారం అందిస్తున్నాయని ఆమె వివరించారు. అమరావతి పరిధిలో మూడు గ్రామాల్లో అధునాతన పద్ధతుల్లో నిర్మాణమవుతున్న పైలట్ ప్రాజెక్టులను పరిశీలించామన్నారు. రాయపూడిలో ఇ-హెల్త్ సెంటర్, కురగల్లులో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులతో పాటు రాజధాని అమరావతి గ్రామాల్లో వరుసగా ఇ-హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించామన్నారు. తాడికొండ నియోజకవర్గం రాయపూడి, మల్కాపురం పైలట్ ప్రాజెక్టుల నిర్మాణాల నాణ్యత, ప్రమాణాలు పరిశీలన చేసి కొన్ని సూచనలు చేశామన్నారు. మల్కాపురం ప్రభుత్వ పాఠశాల, రాయపూడి ఇ-హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.1,77,62,000, మంగళగిరి నియోజకవర్గం కురగల్లులో మూడు పైలట్ ప్రాజెక్టుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. కురగల్లులో ఇ-ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలకు రూ.3,88,26,000 వెచ్చినట్లు తెలిపారు. అమరావతిలో సీఎం జగన్ ఆశయంతో కోట్లాది రూపాయలతో నిర్మాణం జరిగిన, జరుగుతున్న ప్రజా సంక్షేమ ప్రాజెక్టులను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. అధునాతన సదుపాయాలతో ఇటువంటివే 22 అంగన్‌వాడీ సెంటర్లు అందుబాటులోకి రానున్నా యన్నారు. మోడల్ అంగన్‌వాడీ సెంటర్లో పిల్లలకు ప్రి ఎడ్యుకేషన్‌కు, అహ్లాదకర వాతావరణంలో క్లాసురూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా హెల్త్ సెంటర్లలో గర్భవతులకు, బాలింతలకు పోషకాహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నామని, ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

అది మ్యాన్ ట్యాపింగ్

కోటంరెడ్డిపై మంత్రి కాకాని మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఫోన్ ట్యాపింగ్‌పై గగ్గోలు పెడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి...దీనిపై కేంద్రానికి ఎందుకు ఫిర్యాదు చేయలేదని, కోర్టులను ఎందుకు ఆశ్రయించలేదని మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి సూటిగా ప్రశ్నించారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదు.. మ్యాన్ ట్యాపింగ్ అని ఆక్షేపించారు. శ్రీధర్‌రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు ట్యాప్ చేశారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కోటంరెడ్డి చేసిన విమర్శలపై నెల్లూరులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి కాకాని శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదు.. ఆడియో రికార్డేనని శ్రీధర్‌రెడ్డి అంతరాత్మకు తెలుసు. కోటంరెడ్డి మాటలకు టీడీపీ నేతలు వంతపాడుతున్నారు. అవమానం జరిగిందని భావిస్తే దానిపై మాట్లాడకుండా వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎందుకు మాట్లాడుతున్నారు. మనకు గౌరవం, గుర్తింపు వైఎస్‌ఆర్ కుటుంబంతోనే ప్రారంభమైంది. 2019 ఎన్నికల్లో జగన్‌ను చూసి ప్రజలు ఓటేశారు. ఎమ్మెల్యే పదవి ఆయన పెట్టిన భిక్ష కాదా? కోటంరెడ్డి ఉన్న స్థితికి కారణం జగన్ కాదా? ఆయన ఆలోచించుకోవాలి. జగన్‌కు వీరవిధేయుడినని చెప్పుకొని ఇప్పుడు వేరే వాళ్లకు విధేయుడయ్యారని మండిపడ్డారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో చిన్నచిన్న పొరపాట్లు జరిగినా కోటంరెడ్డిని జగన్ విశ్వసించారు. అందుకే అక్కడ వేరే వాళ్లకు అవకాశం ఇవ్వలేదు. నిజంగా శ్రీధర్‌రెడ్డిపై అనుమానముంటే నియోజకవర్గంలో సంపూర్ణంగా బాధ్యతలు అప్పగించే వారా? నిన్నటి వరకు ఆయన ఏది చెబితే అక్కడ అది జరిగేది.. అనుమానం ఉంటే అలా జరుగుతుందా? పార్టీ జీవనదిలాంటిది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు వైసీపీ నుంచి వెళ్లిపోయినా ఏమాత్రం తొణకకుండా పోరాడిన నాయకుడు జగన్. ఒకరో ఇద్దరో పార్టీ నుంచి వెళ్లినంత మాత్రాన జగన్‌కు, పార్టీకి నష్టం లేదు. కోటంరెడ్డి నిర్ణయం ఆత్మహత్యా సదృశ్యమన్నారు. చంద్రబాబు ఉచ్చులో పడి జగన్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంతో ఏమాత్రం సంబంధం లేని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై విమర్శలు సరికాదని హితవు పలికారు. నూటికి 90 శాతం మంది కోటంరెడ్డి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని మంత్రి గోవర్ధన్‌రెడ్డి అన్నారు.

అధికార పార్టీ ఎమ్మెల్యే ఫోన్ ట్యాపింగ్ ఆషామాషీ కాదు: కోటంరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: అనుమానించిన చోట ఉండకూడదని భావించి నీతిగా, నిజాయతీగా తన అధికారాన్ని వదులుకున్నానని వైసీపీ తిరుగుబాటు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆఖరి దాకా ఉండి నామినేషన్లకు ముందు రోజు మోసం చేస్తే తప్పని, తాను అలా చేయలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు కోటంరెడ్డి చేసిన ఆరోపణలపై వైసీపీ నేతలు ఎదురుదాడికి దిగడంతో కోటంరెడ్డి శుక్రవారం మీడియా ముందుకు వచ్చారు. అధికార పార్టీకి దూరం అవుతున్నానంటే ఎన్ని ఇబ్బందులు వస్తాయో తనకు తెలుసని, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని కాదని అన్నారు. విద్యార్థి నేతగా మొదలు 35 ఏళ్లుగా జిల్లా రాజకీయాల్లో ఉన్నవాడినని, తన మనస్సు విరిగిపోయిందని చెప్పారు. అతిగా ఆరాధించిన జగన్ ప్రభుత్వంలో తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని ఆధా రాలు చూపించి బయటకు వచ్చానన్నారు. ట్యాపింగ్‌పై విచారణ జరపమని కోరానని, అధికార పార్టీ ఎమ్మెల్యే ఆరోపణలు చేస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వమే కేంద్ర హోంశాఖకు లేఖ రాసి ఉంటే పారదర్శకత ప్రజలకు అర్థమయ్యేదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేపై ఫోన్ ట్యాపింగ్ ఆషామాషీగా జరగదన్నారు. ట్యాపింగ్ అధికారుల పనికాదు.. ప్రభుత్వ పెద్దల పనే. సమస్యను పక్కదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రు లు, సలహాదారులు తనపై మూకుమ్మడి దాడి చేయ డం దారు ణం. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ కుమార్ వ్యాఖ్య లు బాధించాయి. తన బిడ్డలు ఏం చేశారు.. వారిపై విమ ర్శ లెందుకు? డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకల్లో పాల్గొ న్నాను. ఆరోజు చంద్రబాబును కలిశానన్నది అసత్య మని వివరించారు. తప్పుడు ఆరోపణలతో సజ్జల రామకృష్ణారెడ్డి ఆడియోలు వదులుతున్నారని ఆరోపిం చారు. కోటంరెడ్డి అరెస్టుకు రంగం సిద్ధమని లీకులు ఇస్తున్నారు. అమెరికా అధ్యక్షుడికి సలహాదారుగా ఉండే పరిజ్ఞానం సజ్జలకు ఉంది. థియేటర్ యజమానుల నుంచి నెలకు రూ.2లక్షలు వసూలు చేస్తున్నానన్నది విష ప్రచారమే. తనను ఏ నిమిష మైనా అరెస్టు చేసుకోండి. శాశ్వతంగా జైల్లో పెట్టండి. కేసులు పెట్టి మీరు అలసిపోవాలే గానీ తన గొంతు ఆగే ప్రశ్నే లేదని స్పష్టంచేశారు. తన గొంతు ఆగాలంటే ఒక్కటే పరిష్కారమని, ఎన్‌కౌంటర్ చేయించండి, అప్పుడే తన గొంతు ఆగుతుందని చెప్పారు.

సంపాదకీయం

మోదీ మార్కు ప్రజాస్వామ్యం

అయిదుగురు న్యాయమూర్తుల నియామకంకోసం తాము డిసెంబర్‌లో సిఫార్సు చేసినా ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకో నందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, ఎస్.ఓకా ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల అమలుపై మోదీ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నందువల్ల సుప్రీంకోర్టు కటువుగా వ్యవహరించక తప్పడంలేదు. న్యాయ మూర్తులు పంకజ్ మిత్తల్, సంజయ్ కరోల్, పి.వి.సంజయ్ కుమార్, ఎహసానుద్దీన్ అమానుల్లా, మనోజ్ మిశ్రా పేర్లు 2022 డిసెంబర్ 13న ప్రభుత్వానికి పంపిస్తే ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేదు. అయిదుగురు న్యాయమూర్తులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సిఫార్సుచేస్తే ఇంతవరకు అతీగతీ లేదని న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, ఎస్.ఓకా వ్యాఖ్యానించారు. త్వరలో నియామకం జరుగుతుందని అటార్నీ జనరల్ వెంకటరమణి అన్నప్పుడు "జరుగుతూనే ఉంటుంది. అలా ఏళ్లు గడిచిపోతున్నాయి" అని న్యాయమూర్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం రికార్డు చేయవచ్చునా అని న్యాయమూర్తులు అన్నప్పుడు రికార్డు చేయ నక్కర్లేదు కాని అయిదు రోజుల్లోగా నియామకం పూర్తి అవుతుంది అని వెంకటరమణి బదులిచ్చారు. "సరే పది రోజులు గడువిస్తున్నాం లేకపోతే మేం చేయవలసింది చేస్తాం" అని న్యాయమూర్తులు అన్నారు. ఏ చట్టమూ సంపూర్ణంగా దోషరహితమైంది కాకపోవచ్చు. కానీ అమలులో ఉన్నంతకాలం ఆ చట్టాన్ని అమలు చేయాల్సిందే. న్యాయమూర్తుల నియామకం విషయంలో మాత్రం మోదీ సర్కారు ఇంతకాలంగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను అమలు చేయకుండా తాత్సారంచేసి చట్టం అమలుకాకుండా అడ్డుకుంటోంది.

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక్క కొలీజియం విషయంలోనే కాక ఇతర సందర్భాలలో కూడా న్యాయవ్యవస్థ మీద విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. కొలీజియం వ్యవస్థ లోపభూయిష్టం అయిందని ప్రస్తుత సర్కారు భావిస్తే పార్లమెంటులో చట్టం చేయడానికి ఏ ఆటంకమూ లేదు. సుప్రీంకోర్టు కూడా అడ్డుతగిలే ఉద్దేశంలో లేదు. సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను ఎటూ తేల్చకుండా నాన బెట్టడం మోదీ సర్కారుకు అలవాటైపోయింది. సుప్రీంకోర్టు సిఫార్సులను ఆమోదించకుండా ఉండడానికి ప్రభుత్వంచూపిన కారణాలను సుప్రీంకోర్టు అంత ర్జాలంలో ఉంచేసరికి ప్రభుత్వం ఉలిక్కిపడింది. నిజానికి కొలీజియంకు, ప్రభుత్వానికి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను, సంవాదాలను బహిర్గతంచేయడం సంప్రదాయం కాదు. కానీ సాక్షాత్తు కేంద్ర న్యాయశాఖ మంత్రే సుప్రీంకోర్టు మీద పదే పదే విమర్శలు సంధిస్తున్నందువల్ల సుప్రీంకోర్టు ప్రభుత్వ అభ్యంతరాలను జనం దృష్టిలో పడేట్టు చేయవలసి వచ్చింది. ఈ విషయంలో తాము ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరిస్తు న్నామని కూడా సుప్రీంకోర్టు తెలియజెప్పాలని నిర్ణయించుకుంది. 2019లో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత సుప్రీంకోర్టు సిఫార్సుల విషయంలో ధిక్కారస్వరం వినిపించడం బాగా పెరిగింది. దీనివల్ల న్యాయమూర్తుల నియామకమే కాక బదిలీలూ ఆగిపోతున్నాయి. ఇది విచారణా ప్రక్రియను దెబ్బతీస్తోంది. అదీ కాక ప్రభుత్వం ఎటూ తేల్చ నందువల్ల సమయానికి నియామకం జరగకపోవడంతో న్యాయమూర్తుల సీనియారిటీకి కూడా భంగం కలుగుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్నది కొలీజియం కనక ఆ సిఫార్సులకు నిబద్ధమై ఉండాలని గత నవంబర్‌లో కూడా సుప్రీంకోర్టు సూచించినా ప్రభుత్వం మునుపటి వైఖరి మానలేదు. సుప్రీంకోర్టు సిఫార్సుల విషయంలో ప్రభుత్వానికి భిన్నాభిప్రాయం ఏదైనా ఉంటే ఒకసారి అభ్యంతరాలేమిటో తెలియజేస్తూ ఆ సిఫార్సులను వెనక్కు పంపవచ్చు. సుప్రీంకోర్టు తన సిఫార్సులను అవసరమనుకుంటే సవరిస్తుంది. లేకపోతే మునుపటి సిఫార్సులనే పునరుద్ఘాటిస్తుంది. అప్పుడు ప్రభుత్వం మళ్లీ అభ్యంతరాలు లేవనెత్తడానికి అవకాశంలేదు. కానీ సుప్రీంకోర్టు సిఫారుసులనుఅడ్డుకోవడానికి ప్రభుత్వం వాటిని ఎటూ తేల్చకుండా జాప్యం చేస్తోంది. ఒక హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా సిఫారసు చేసిన వ్యక్తి కేవలం 19 రోజులలో ఉద్యోగ విరమణ చేయవలసి వస్తోంది. అంటే ఆ న్యాయమూర్తికి దక్కవలసింది దక్కకుండా పోతోంది.

ఏదో ఒకరకంగా సుప్రీంకోర్టుతో ఘర్షణకు దిగాలని మోదీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు ఉంది. ఉపరాష్ట్రపతి ధన్కర్, కేంద్ర న్యాయశాఖమంత్రి కిరణ్ రిజిజు నిర్విరామంగా సుప్రీంకోర్టును రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నా మోదీ నోరు మెదపడం లేదు. అంటే ధన్కర్, రిజిజు చేస్తున్న విమర్శలు వారి వ్యక్తిగత స్థాయిలో చేస్తున్నవి కాదనీ, వాటికి కేంద్రప్రభుత్వ మద్దతు ఉందని అనుకోవలసి వస్తుంది. కిరణ్ రిజిజుకు సుప్రీంకోర్టును విమర్శించడం నిత్యకృత్యమై పోయింది. ఆయన ఎంతదాకా వెళ్లారంటే "అసలు కొలీజియం మాకు ఫైళ్లు పంపవలసిన అవసరమే లేదు. ప్రభుత్వం ఆ ఫైళ్లను తొక్కి పెడ్తోంది అనుకుంటే సుప్రీంకోర్టు తోచినట్టు చేసుకోవచ్చు" అని రిజిజు తీవ్రంగా వ్యాఖ్యానించడం సుప్రీంకోర్టును కించపరచడం అటుంచి కేంద్ర మంత్రి హోదా కూడా దిగజార్చినట్టే.

న్యాయవ్యవస్థ మీద సంపూర్ణ అధికారం కోసం మోదీ సర్కారు ప్రయత్నిస్తున్నట్టు స్పష్టం అవుతోంది. కానీ ఆ మాట నేరుగా చెప్పడానికి ఎందుకనో సందేహిస్తోంది. అందుకే ఇప్పుడున్న కొలీజియం వ్యవస్థ బదులుగా కొత్త బిల్లు ప్రవేశ పెడ్తారా అని అడిగితే ఏ సమాధానమూ ఇవ్వకుండా మిన్నకుండిపోయింది. కొలీజియం సిఫార్సులను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం విపరీతమైన జాప్యం చేయడంవల్ల కొంతమంది ప్రసిద్ధ న్యాయవాదులు అసలు న్యాయ మూర్తులుగా నియామకానికి అంతకుముందు చూపిన సమ్మతిని ఉపసంహరించు కుంటున్నారు. ఒకటికి రెండు సార్లు కొలీజియం సిఫార్సుచేసినా ప్రభుత్వంనుంచి చలనం ఉండడం లేదు. కనీసం తమ అభ్యంతరాలేమిటో కూడా ప్రభుత్వం చెప్పకపోవడం విచిత్రంగా ఉంది. కొంతమందిని న్యాయమూర్తులుగా నియమించడాన్ని సమ్మతించక పోవడానికి ప్రభుత్వానికి కారణాలు ఉండవచ్చు. అవేమిటో చెప్పకుండా మొత్తం ఫైలును తొక్కి పెట్టడం సహాయనిరాకరణే అనుకోవాలి. సుప్రీంకోర్టు సిఫార్సులు పంపిన తరవాత ఎన్నాళ్లలోగా ప్రభుత్వం సమ్మతో అసమ్మతో తెలియజేయాలి అన్న విషయంలో నిర్దిష్ట గడువు ఏమీలేకపోవడం ప్రభుత్వం ఇష్టా రాజ్యంగా వ్యవహరించడానికి అవకాశం కలుగుతోంది. పరస్పర సంప్రతింపులద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవడం అసాధ్యమైతే కాదు. కానీ ప్రభుత్వపక్షం ఘర్షణవైఖరి అనుసరించడం వివాదం ఒక కొలిక్కి రాకపోవడానికి ప్రధాన కారణంగా తయారైంది. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి భంగం కలగకుండా ప్రత్యామ్నాయమార్గాన్ని సూచించడం ప్రభుత్వానికి అసాధ్యమేమీ కాదు. కానీ ప్రభుత్వం సయోధ్యకు సిద్ధ పడకపోవడమే పెద్ద సమస్య. ప్రభుత్వ లక్ష్యం సామరస్యం కాదు. ఆధిపత్యం చెలాయించడమే లక్ష్యం. సకల వ్యవస్థలమీద ఆధిపత్యం సంపాదించిన మోదీకి న్యాయవ్యవస్థే కొరుకుడు పడడంలేదు. ఏ వ్యవస్థా స్వతంత్రంగా వ్యవహరించకుండా చూడడమే మోదీ మార్కు ప్రజాస్వామ్యం.

దింపుడు కళ్లం ఆశలు

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

మామూలే. దింపుడు కళ్లం ఆశలు ప్రతి ఏటా చర్విత చరణమే. ఈ ఏడాది బాగుంటుందని ఆశ పడడం, అబ్బే గతమెంతో మేలు వచ్చే ఏటి కంటే అని సమాధానపడడం. బడ్జెట్‌లో ఏముంటాయో, దాని వల్ల ఎవరికి ఎంత లాభమో, ఎంత నష్టమో, ఎంత మేలో, మరెంత కీడో లెక్కలు చెబుతాయి. కాని, 150 కోట్ల జనాభా ఉన్న సువిశాల భారతావనిలో ఆ లెక్కలు అర్థం అయ్యేది మాత్రం ఎంత మందికి. రూపాయి రాక, అదే రూపాయి పోక.... పొద్దున్నే పత్రికల్లో సున్నాకి రంగులు వేసి చూపిస్తారు. మనిషి ముఖానికి వేసుకున్న రంగుల వంటివే అవి. అర్థం కావు. అర్థం చేసుకోలేం. ప్రయత్నించడం వృథా. సర్దుకుపోవడమూ, వచ్చే సంవత్సరం కోసం ఎదురు చూడడం వినా బతుకులో పెద్ద మార్పు ఉండదు. మరో రెండు దశాబ్దాల తర్వాత భారత భవితకు ఈ బడ్జెట్ పునాది అంటుంది ఏలిక. ఇక్కడ కదిలిపోతున్న పునాదుల గురించి మాత్రం పల్లెత్తుమాట మాట్లాడరు. మాట్లాడలేరు. మాట్లాడకూడదు. మాటంటే రెండు పెదవుల నుంచి వచ్చే శబ్దం కాదు కదా. మాటంటే ఎదుటి వారికి వినపించే పదం కాదు కదా. మాటంటే అణుబాంబు. మాటంటే ఏలికల ఆరాధ్యం శ్రీరాముని శాసనం. మాటంటే నిలబెట్టుకోవాల్సిన ప్రమాణం. అందుకే పెదవి విప్పరు. భవిష్యత్ చిత్రపటం గురించి కలలు కలలుగా, అలలు అలలుగా వర్ణిస్తారు. నేటి వృద్ధులకు భవిష్యత్ గురించి పట్టించుకునే అవసరం ఉండదు. నేటి యువతకు భవిష్యత్ హామీ గుర్తుండదు. ఈనాటి బాలలకు భవిష్యత్‌లో ఈ అమృత్ కాల్ చేరే అవకాశం ఉంటుందనే ఆశా ఉండదు. అందుకే వర్తమానాన్ని గాలికి వదిలేసి భవిష్యత్ గురించి పూల గుత్తుల వంటి సువాసనలు సృష్టిస్తారు. వీళ్లే కాదు... దేశాన్ని ఏలిన వారంతా చేసింది ఇదే. చరిత్ర చదువుకోవడానికి, మననం చేసుకోవడానికి కూడా భయపడే స్థితికి వచ్చేసాక ఎలా ఉంటుందో తెలియని భవిష్యత్ గురించి కలలు కనడం కాసింత ఊరట. అవును, ఊరడిల్లడం తప్ప, ఊరికే అలా జీవించడం తప్ప ఇంకేం చేయగలం.

ఓ ప్రయోజనాన్ని ముందే నిర్ణయించుకుని అందుకోసం ఆ దిశగా పరుగులు పెట్టడం, ప్రజలను అటువైపే పరుగులు పెట్టేలా చేయడం నయా ఏలికల నూతన రాజ్యాంగం. చూపుడు వేలుపై చుక్క తప్ప మిగిలిన దేహమంతా దిశమొలగా కనిపించాల్సిన సమయం దగ్గరవుతున్నప్పుడు ఇలాంటి లెక్కలే కనిపిస్తాయి. సామాన్యుడు అనే పదం, పేదవారు అనే మాట ఇక్కడ నిషేదించి చాలా కాలమైంది. కార్పొ"రేట్లు" భవితను నిర్ణయిస్తున్న సందిగ్ధ సంధ్యలో జీవిస్తున్నాం. సెల్ ఫోన్ ధరలు తగ్గాయి. నాకు ఆకలేస్తోంది. దేశ రక్షణ చాలా ముఖ్యం. నాకు ఆకలేస్తోంది. ఆకాశయానం మరింత సులభతరం. అమ్మా నాకు ఆకలేస్తోంది. అందరికీ అందుబాటులో వజ్రాలు. తల్లీ నాకు ఆకలేస్తోంది. బడ్జెట్‌లో అన్ని హంగులూ ఉన్నాయి. ఒక్క సామాన్యుడి ఆకలి తీర్చడం తప్ప.

వ్యవసాయం దండగగా మారి రెండున్నర దశాబ్దాలైంది. ఇంతకాలం దేశ ప్రజంతా మూడు పూటలా భోజనం చేస్తోంది. వ్యవసాయం దండగగా మారిన సందర్భంలో ఈ భోజనం ఎక్కడి నుంచి వస్తోందో మాత్రం పెదవి విప్పలేకపోతున్నాం. ఉరితాళ్లు వరిని పండిస్తున్నాయి. పురుగుల మందు మనకి పెరుగన్నం పెడుతోంది. రైతులు, వారి కుటుంబాలు ఏటీఎం సెంటర్ల ముందు తమకు నప్పని యూనిఫాంతో ఒకచోట, తలలు దించుకుని చేతులు మాత్రమే ముందుకు చాచి దేహీ అంటూ దేవాలయాల ముందు కూర్చుంటున్న అపురూప దృశ్యం నేడు దేశమంతా కనిపిస్తున్న వర్తమానం. వారందరికీ భవిష్యత్ చిత్రపటం చిగురేస్తుందని మాత్రం పత్రికలు, చానెళ్లు చర్చలు జరపడం కళ్ల ముందు కదలాడుతున్న విషాదం.

సీనియర్ జర్నలిస్టు, 9912019929

మోసాలతో అదానీ గ్రూపు లూటీ

డాక్టర్ సోమ మర్ల

ప్రపంచ కుబేరుల్లో రెండవ పెద్ద సంపన్నుడిగా ప్రకటితమైన గౌతమ్ అదానీ స్థాపించిన గ్రూపు అనేకరకాల మోసాలకు పాల్పడిందని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ ఆర్థిక పరిశోధనా సంస్థ నివేదిక వెల్లడించిన అంశాలు నివ్వెరపరచాయి. ఈ వార్త ప్రపంచమంతటా ప్రకంపనలు పుట్టించింది. 2022 సెప్టెంబరులో ప్రపంచ ఆర్థిక దినపత్రిక 'ఫోర్బ్స్' అదానీ రెండవ అతిపెద్ద సంపన్నుడని ప్రకటించింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తదితరాల నుంచి అదానీ గ్రూపు పెద్దఎత్తున రుణాలు తీసుకున్నది. ఎకౌంట్లు చూపడంలో మోసాలు, స్టాక్ మార్కెట్‌లో అక్రమాలకు పాల్పడినట్లుగా హిండెన్‌బర్గ్ 2023 జనవరి 31వ తేదీ ఉదయం ప్రకటించింది. 155.5 బిలియన్ డాలర్ల సంపన్నుడు అదానీ అని పోర్బ్స్ తెలిపింది. ఈ సంస్థ మోసాలన్నీ బట్టబయలైనతర్వాత రెండు రోజుల్లో స్టాక్ మార్కెట్లు ఇతర విధాలుగా సంస్థ 5.2లక్షల కోట్ల రూపాయలు(65 బిలియన్ డాలర్లు) నష్ట పోయింది. శుక్రవారంనాటికి నష్టాలు 8లక్షలకుపైగా ఉన్నాయని వార్తలు. దాదాపు 160పేజీల హిండెన్‌బర్గ్ నివేదిక అనేక లోతు అంశాలను వెల్లడించింది.

మోదీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా ప్రైవేటీకరణ ద్వారా అనేక ప్రభుత్వ ఆస్తులను అదానీ గ్రూపుకి కట్టబెట్టింది. ఓడరేవులు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, బొగ్గు దిగుమతులు, విద్యుత్ ప్లాంట్‌లు, సిమెంట్ కంపెనీలు గ్యాస్, సౌర విద్యుత్ ప్రాజెక్టులు వంటికీలకమైన వాటిని అదానీకి కట్టబెట్టారు. ఎస్‌బీఐ, ఎల్ఐసీ తదితర ప్రభుత్వ ఆర్థిక సంస్థలనుంచి భారీ మొత్తాలను అదానీ గ్రూపుకి చాలా ఉదారంగా రుణాలరూపంలో అందించి దేశసంపద లూటీచేసేందుకు సహకరించారు. వీటిని కట్టబెట్టడం కూడా పోటీలేకుండా ఒకే టెండర్‌ను ఆధారంచేసుకుని అతి తక్కువ ధరలకు అదానీకి ఇచ్చేశారు. ఎలాంటి సెక్యూరిటీ, హామీలు లేకుండానే అదానీ గ్రూపుకు ఏర్పడిన 'సద్భావన' పైన మాత్రమే చాలా ఉదారంగా వేలాది కోట్ల రూపాయల రుణాలనుఇచ్చేశాయి. ఆశ్రిత పెట్టుబడీదారుడైన అదానీకి, భారత ప్రభుత్వానికి మధ్య పెనవేసుకుపోయిన బంధాన్ని ఈ కుంభకోణం తెలియజేస్తున్నది. స్వయం ఉపాధికోసం రుణం తీసుకునే చిన్న పారిశ్రామిక వేత్తలు, లేదా రైతులకు అదానీకి ఇచ్చినంత ప్రాధాన్యతను మనం ఊహించగలమా?

పెద్దఎత్తున జరిగిన ఈ మోసం దేశ ఆర్థికవ్యవస్థనే ప్రమాదంలోకి నెట్టే అవకాశాలున్నాయి. మీడియా వార్తలప్రకారం, ఎస్‌బీఐ, ఎల్ఐసీ, తదితర ఆర్థిక సంస్థలు అదానీ గ్రూపు ప్రాజెక్టులకు నిధులను అందచేసి వేలాదికోట్ల రూపాయలు నష్టపోయాయి. 2022 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం అంచనాల ప్రకారం, అదానీ గ్రూపుకి 2లక్షల కోట్ల అప్పులున్నాయి. ఇందులో మన ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీ లాంటి ఆర్థికసంస్థలు, ఎస్‌బీఐ ఇచ్చిన రుణాలు మొత్తం అప్పుల్లో 40శాతం ఉన్నాయి. నిజ విలువకంటే అత్యధిక రేట్లకు స్టాక్ మార్కెట్‌లలో అదానీ షేర్లను ఎల్ఐసీ ఒక్కటే 77వేలకోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. జనవరి 30వ తేదీ నాటికి ఈ సంస్థ 23,500కోట్ల రూపాయలను నష్టపోయింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రైవేటుబ్యాంకుల వలెనే అదానీ గ్రూపుకి రెండుసార్లు రుణాలిచ్చాయి. కష్టపడి డిపాజిట్ల రూపంలో పొదుపుచేసుకున్న మిలియన్ల మంది భారతీయులు తీవ్ర రిస్కును ఎదుర్కొంటున్నారు. ఇంతకల్లోలం జరిగినప్పటికీ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల్లో కొద్దివాటికి మాత్రమే అదానీ గ్రూపు సమాధానమిచ్చింది. అభివృద్ధిచెందుతున్న భారతదేశంపై దుష్ప్రచారం చేసేందుకే హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిందని ఇదంతా ఒట్టిదని అదానీ గ్రూపు వాదిస్తుంది. జాతీయవాదం ముసుగు కింద తీవ్రమైన మోసాన్ని తేలికజేసి మాట్లాడేందుకు అదానీ ప్రయత్నిస్తున్నారు.

ఆశ్రిత పెట్టుబడిదారు వ్యవస్థతో బీజేపీ బంధం

అదానీ సంపద నీటి బుడగ ఒక్కసారిగా పేలిపోయింది. ఆర్థిక అంచనాలు, స్టాక్ మార్కెట్‌లో ప్రభుత్వ సంపదను, బ్యాంకుల నిధులను పెట్టి వ్యాపారంచేసి అదానీ సంపదను పెంచారు. 2001లో అదానీ అంబానీతో పోలిస్తే చిన్న వ్యాపారి. ఆనాడు అదానీ కంటే అంబానీ 500 రెట్లు ఎక్కువ సంపదపరుడు. ఆనాటినుంచీ మోదీ సహాయంతో అదానీ అతి పెద్ద కార్పొరేట్ కుబేరుడయ్యాడు. కాలేజీలో చదువు మధ్యలో ఆపేశాడు. 1980లలో వస్తు వ్యాపారాన్ని ప్రారంభించాడు. 1990లలో సరళీకరణ, ప్రపంచీకరణ రాజ్యం అవతరించడంతో 1995లో అదానీ ముంద్రా పోర్టును స్థాపించాడు. 2002లో అదానీ ప్రధాన హోల్డింగ్ కంపెనీ విలువ 70 మిలియన్ డాలర్లు. దశాబ్ది కాలంలో ఆయన సంపద 20వేల మిలియన్ డాలర్లకు ఎగబాకింది. అంటే 300 రెట్లు సంపద పెరిగింది. కార్పొరేట్ చరిత్రలో ఇంత వేగంగా పెరిగిన దాఖలా గతంలో లేదని ఫోర్బ్స్ పత్రిక వ్యాఖ్యానించింది. ఎనిమిదేళ్ల కాలంలో కార్పొరేట్-మోదీ నాయకత్వంలోని కాషాయ ప్రభుత్వం వల్ల అదానీ సంపద 800శాతం పెరిగింది. 2019లో ఆరు విమానాశ్రయాలను ప్రభుత్వం ప్రైవేటీకరించగా వాటన్నింటినీ అదానీ గ్రూపు స్వాయత్తం చేసుకుంది. గతంలో ఏ మాత్రం అనుభవంలేని అదానీ కంపెనీకి మోదీ ప్రభుత్వం వీటిని కట్టబెట్టింది. ఒక వ్యాపారాన్ని ఆధారం చేసుకుని మరో వ్యాపారానికి అదానీ తన ఆర్థిక వనరులను కొత్త కంపెనీలకు విస్తరించడానికి బ్యాంకులు సహకరించాయి. గుజరాత్ ముంద్రాలో ప్రత్యేక ఆర్థిక జోన్, ఒక ఓడరేవును ఏర్పాటుచేశాడు. ఇది భారతదేశంలోనే అతి పెద్ద వ్యాపార కేంద్రం. ఈ జోన్‌లో బొగ్గు మొదలు ప్లాస్టిక్ ఫ్యాక్టరీ ఏర్పాటువరకు ఉన్నాయి. పునర్వినియోగ ఇంధన ఉత్పత్తివైపు ఎక్కువగా కేంద్రీకరించారు. ఇందులో భాగంగా అదానీ గ్రీన్స్‌ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటుచేశారు. కర్బనపు వాయువులు విడుదలకాని ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. ఇక్కడే బొగ్గు వినియోగ విద్యుత్తు ప్లాంటు నెలకొల్పారు. ఈ విషయంలో ఫ్రాన్స్ సంస్థ టోటల్ ఎనర్జీతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నాడు. గ్రీన్ హైడ్రోజన్‌ను 20 బిలియన్ డాలర్లతో ఉత్పత్తి చేయాలన్నదే లక్ష్యం. ఎన్‌డీటీవీలో భారీ వాటాలను దక్కించుకున్నాడు. తద్వారా ఉదారమైన జర్నలిజాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను హరించడానికి పూనుకున్నారు. ఆశ్రిత పెట్టుబడీదారీ విధానాన్ని మరింత బలోపేతంచేశారు. మోదీ ప్రభుత్వం అత్యంత మితవాద విధానాలను అమలు చేసిన ప్రధాని మోదీ, అదానితో ఉన్న అనుబంధంవల్ల ఆర్థిక కార్పొరేట్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోగలిగారు. భూములు, సహజ, ఖనిజ వనరులు, ఫ్యాక్టరీలు తదితరాలను అతిచౌకగా స్వాధీనం చేసుకోగలిగారు. ఆయన ఏరోజూ ఉత్పత్తిరంగంలోకి ప్రవేశించలేదు. ఆయన తీసుకున్న రుణాలన్నీ నకిలీ కంపెనీలలోనూ ఊహాజనిత స్టాక్‌మార్కెట్ వాణిజ్యంలోనూ పెట్టుబడిగా పెట్టారు. అనుత్పాదిక పెట్టుబడులను పెట్టడంద్వారా చాలా వేగంగా ధనాన్ని సంపాదించగలిగారు. అయితే ఇదంతా గాలిబుడగలాగా పేలిపోయింది. అదానీకి అప్పులిచ్చిన ఎస్‌బీఐ, ఎల్ఐసీ, తదితర సంస్థలు భారీగా నష్టపోయాయి. ఆర్థికంగా కుదేలైపోయి దేశసంపదను కొల్లగొట్టడానికి వెనుక మోదీ అండలేదని చెప్పగలరా? చిన్నచిన్న డిపాజిట్ దారులు కోట్లాది రూపాయలు నష్టపోయారు. ఆయనను ఆదుకునేందుకు ప్రభుత్వ ధనాగారం నుంచి ఉద్దీపన నిధులను అందించరాదు. ఉద్దీపనలు ప్రకటించి ఆశ్రిత పెట్టుబడీదారీ సంక్షోభం నుంచి కార్పొరేట్లను రక్షించడానికి ప్రయత్నం చేయరాదు. ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాదాన్ని, ప్రైవేటీకరణను, ప్రభుత్వ ఆస్తులను నామక: ధరలకు పెట్టుబడుదారులకు కట్టబెట్టకుండా నిరోధించడానికి ట్రేడ్ యూనియన్ ప్రజలు ఉద్యమాలు చేయాలి. ఇలాంటి లూటీలతో ఆర్థిక సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇటువంటి కార్పొరేట్ల వల్ల దేశప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశాన్ని నివారించాలి.

కార్యకర్తలే కుటుంబం...పార్టీనే శ్వాస

కార్యకర్తలే కుటుంబంగా...పార్టీనే ఊపిరిగా తుదిశ్వాస వరకు పాటుపడిన ఆదర్శమూర్తి అమరజీవి మోదుమూడి లలితాదేవి. ఒకపక్క గంపెడుసంతానాన్ని సాకుతూ మరో పక్క చదువుకునేందుకు, వైద్యం కోసం మచిలీపట్నం వచ్చిన పార్టీ శ్రేణులకు సేవలను అందిస్తూ పట్టణంలో కమ్యూనిస్టుపార్టీ, మహిళా సమాఖ్య పటిష్టతకు ఆమె చేసిన కృషి ఎనలేనిది. వారు నివాసం ఉన్న తాడేపల్లి వారి సత్రంలాగే ఆమె ఇల్లుకూడా ఎప్పుడూ వచ్చి పోయే వారితో ఒక సత్రంలాగానే ఉండేది. కమ్యూనిస్టు పార్టీ అగ్రగణ్యులు అమరజీవి చండ్ర రాజేశ్వరరావు నుంచి సామాన్య కార్యకర్త వరకు ఆమె సేవ పొందని వారులేరంటే అతిశయోక్తికాదు. ఇంటికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు తాను తిన్నా తినకపోయినా తృప్తిగా భోజనం పెట్టే మహాసాధ్వి ఆమె. పార్టీ కోసం పూర్తి కాలం పనిచేసే నలుగురికి ఇంట్లోనే భోజనం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనం, వసతి కల్పించి ఎంతోమంది ఉన్నత విద్యకు తోడ్పాటు నందించి వారు ప్రతిభావంతులయ్యేందుకు సహకరించిన మాతృమూర్తి లలితా దేవి. కార్యకర్తలను లలితాదేవి అన్నిరకాలుగా ప్రోత్సహించారు. తమ పిల్లలను సైతం పార్టీలో పనిచేసే కార్యకర్తలుగా తీర్చిదిద్దారు. ఆస్తిని అమ్మి ఉద్యమానికి ఖర్చుచేసి చివరకు మందులు కొనలేని స్థితిలో అనారోగ్యంతో బాధపడుతున్నా వెరవక తమ పిల్లలలోనూ ఉద్యమస్ఫూర్తి నింపిన ఉద్యమనేత లలితాదేవి.

కృష్ణాజిల్లా దివి తాలూకా కోడూరు మండలం లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన ధనిక బ్రాహ్మణ కుటుంబంలో వల్లమూడి నరసింహారావు, రత్తమ్మలకు లలితాదేవి జన్మించారు. మోదుమూడి శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన మేనత్త కొడుకు శ్రీహరిరావుతో వివాహం అయినది మొదలు ఎన్ని కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కొన్న ధీరోదాత్తురాలు లలితాదేవి. శ్రీహరిరావు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి ఆకర్షితుడై జిల్లాలో ప్రజా ఉద్యమాలను నిర్మించారు. అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. పార్టీపై నిషేధం అమలులో వున్న సమయంలో శ్రీహరిరావు నాలుగు సంవత్సరాలకు పైగా రహస్యజీవితం గడిపారు. ఆ సమయంలో లలితాదేవి అనేకకష్టాలను ఎదుర్కొని కూడా పార్టీకి విధేయురాలిగా నిలిచారు. అనంతరం పార్టీ ఆదేశం ప్రకారం నివాసాన్ని మచిలీపట్నానికి మార్చారు. అప్పటి నుంచి అనేక ఇబ్బందులకు ఓర్చి ధైర్యంగా నిలబడి జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పార్టీ, మహిళ, ప్రజా సంఘాలనిర్మాణానికి భర్తతోకలిసి కృషిచేశారు. మచిలీపట్నంలోనేగాక చుట్టు పక్కలగల పోలవరం, రాయవరం, మల్లవోలు, చిన్నాపురం, గుండు పాలెం, కమ్మవారిచెరువు,పెడన,కప్పలదొడ్డి వంటి ప్రాంతాలలో పార్టీ, మహిళాసంఘాల నిర్మాణానికి విశేష కృషి చేశారు.

వివిధ సందర్భాల్లో పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు దళంగా ఏర్పడి ఏరియాలో ఇంటింటికితిరిగి విరాళాలను వసూలుచేసేవారు. వారికి లలితాదేవి నాయకత్వం వహించే వారు. ఎన్నికలసమయంలో విజయవాడ, మైలవరం, జగ్గయ్యపేట తదితర ప్రాంతాలకు బందరు తాలుకా నుంచి మహిళాదళాలను తీసుకువెళ్లి సీపీఐ అభ్యర్థుల తరపున ప్రచారంచేసేవారు. లలితాదేవి పార్టీ నిర్మాణం లోనే గాక సేవా కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు. 1977 నవంబరు 19న దివిసీమలో భారీ ఉప్పెన సంభవించడంతో పార్టీ రెండు నెలలు పాటు నిర్వహించిన సేవా కార్యక్రమాలలో ఆమె ప్రత్యక్షంగా పాల్గొని అందరి మన్ననలను పొందారు. ఈ సందర్భంగా బందరు, పెడన, గుండు పాలెం, చిన్నాపురం, కమ్మవారి చెరువు తదితర ప్రాంతాలలో బుట్టయ్యపేట మహిళా సంఘం ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు, పాడిగాదెలకు రుణాలు ఇప్పించారు. పట్టణంలోను, చుట్టుపక్కల గ్రామాలలో 15వయోజన పాఠశాల లను ఏర్పాటు చేశారు.మచిలీపట్టణంలో పార్టీ నిర్మాణం కోసం తమ ఆస్తులను కూడా త్యాగం చేశారు. 1962లో పార్టీ ఆధీనంలో వున్న రవీంద్ర చేనేత సహకార సంఘం దివాళా తీయటంతో స్థానిక శివగంగలో వున్న రెండు ఎకరాల భూమిని విక్రయించి వచ్చిన పైకాన్ని సొసైటీ నిర్వహణకు ఇచ్చారు. ఆమెకు ఉన్న బంగారు, వెండి ఆభరణాలు పార్టీ సమావేశాలకు, నిర్మాణం కోసం అనేక సందర్భాలలో విరాళాల రూపంలో ఇచ్చారు. తన ఆభరణాలను తాకట్టు పెట్టి అనేక అవసరాలను తీర్చారు. చివరకు బందరులో పార్టీ కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తన మంగళసూత్రం సైతం యిచ్చి వేశారు. 1998 ఫిబ్రవరి 5వ తేదీన తుదిశ్వాస విడిచే వరకు పార్టీ అభివృద్ధికి, భర్త ఆశయాల సాధన కోసం శ్రమించారు. ఆమె 25వ వర్ధంతి ఆదివారం. ఆమెని ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో నేడు యువతరం ముందుకువెళ్లాలి. ఆమె ఏ ఆశయంకోసం శ్రమించారో దానికోసం కృషి చేయడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి.

(ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం లలితాదేవి 25వ వర్ధంతి సందర్భంగా...)

కాళీపట్నపు నటరాజ్ కుమార్

అప్పర్ భద్రకు నిధులు పోలవరంకు మొండిచేయి



వి. శంకరయ్య

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపించిన బుందేల్ ఖండ్ ప్రాంతం(విభజన చట్టంలో దానికి అమలు జరిపే ప్యాకేజీ ఇస్తామన్నారు) సస్యశ్యామలం కోసం అమలు జరుగుతున్న కెన్-బెత్వా నదుల అను సంధాన పథకం ఇప్పటివరకు పోలవరంతో పోల్చుకొని అంగలార్చే వారం. తాజాగా అప్పర్ భద్ర కూడా చేరింది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధాని పదవి చేపట్టిన తర్వాత బిజెపికి రాజకీయ ప్రయోజనం లేనిదే పిల్లికికూడా భిక్షం పెట్టదని మరోసారి రుజువైంది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 90 మేరకు పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడమైంది. ఇదే సెక్షన్‌లో ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే వ్యయం కేంద్రం పూర్తిగా భరించాలని పొందుపర్చారు. అంతేకాదు. నష్ట పరిహారం, పునరావాసానికి అయ్యే వ్యయం కేంద్రం భరించాలని, పైగా పర్యావరణ, అటవీ తదితర అనుమతులు కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని నిర్దిష్టంగా పేర్కొన్నారు. కాని ఏం జరిగిందీ ప్రత్యేకించి చెప్పే పనిలేదు. ప్రత్యేక హోదా చట్టంలో లేదని కొన్నాళ్లు గడిపి తుదకు ఎగ్గొట్టినట్లు పోలవరం ప్రాజెక్టులో తాగునీటి వ్యయం తాము భరించబోమని తొలి కొర్రీ వేసింది. తుదకు 2017 లో కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని చెప్పి 2013-14 నాటి షెడ్యూల్ రేట్లు మేరకే భరిస్తామని కేంద్ర ఆర్థికశాఖ అంటోంది. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని కేంద్ర మంత్రి వర్గం సవరించవచ్చా? అధికార ధిక్కరణే కదా? తుదకు రెండవ డిపిఆర్ ఇంత వరకు ఆమోదించలేదు. ఇప్పుడు తాజా బడ్జెట్‌లో పోలవరం ఊసేలేదు.

కాని పక్కనే వున్న కర్నాటక రాష్ట్రానికి చెందిన అప్పర్ భద్ర ఎత్తిపోతల పథకానికి ఈ బడ్జెట్‌లో 5,300 కోట్లు రూపాయలు కేటాయించారు. కర్నాటకలో బిజెపి ప్రభుత్వం వున్నందున తిరిగి అధికారం నిలబెట్టుకోవడానికి 2022 లోనే అప్పర్ భద్రను కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. రెండు విధాలుగా గోడదెబ్బ చెంపదెబ్బ వెనుకబడిన రాయలసీమకు తప్పడంలేదు. 29.9 టియంసిలతో తుంగభద్ర ఎగువ భాగంలో ఎత్తిపోతలు పెడితే దిగువ రాష్ట్రమైన రాయలసీమకు ముమ్ముందు నీటి ఎద్దడి తప్పదు. 194 టియంసిల సామర్థ్యంతో నిర్మించిన తుంగభద్ర జలాశయం పూడిపోయిందని ఏపీ వాటాలో కోత పెడుతున్నారు. ముమ్ముందు నీటి ప్రవాహంలేదని మరింత కోతపెట్టే ప్రమాదం వుంది. కాగా ఎగువ, దిగువ కాల్వలు కర్నాటక భూభాగంలోకి కొంతమేర వస్తున్నందున కర్నాటక రైతుల జలచౌర్యం తప్పడంలేదు. 2022లో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినపుడు బడ్జెట్‌లో భారీగా నిధులుఇచ్చి పోలవరం తోకకోసినా ఏపీ ఆర్థికమంత్రి, ముఖ్యమంత్రి నిరసన తెలపలేకపోవడం యాదృచ్ఛికమేమీ కాదు. కర్నాటకలో ఎన్నికలు ముంచుకొస్తు న్నందున ఈ పథకం త్వరితగతిన నిర్మాణం జరిగే అవకాశంఉంది. తుంగభద్ర జలాశయం ఎగువభాగంలో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నందున డిపిఆర్ సామర్థ్యానికి మించి నీళ్లు ఎత్తిపోసుకున్నా అజమాయిషీచేసే యంత్రాంగంలేదు. తుంగభద్ర బోర్డుకు దానిపై అధికారంలేదు. ఫలితంగా రాయలసీమకు ముమ్ముందు తుంగభద్ర నుండి వచ్చే నీళ్లకు భారీగా గండి పడబోతోంది.

కొసమెరుపు ఏమంటే అప్పర్ భద్ర జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే సమయంలో జరిగిన నీటి కేటాయింపులు బిజెపియేతర రాష్ట్రాలకు సాధ్యంకాదు. బచావత్ ట్రిబ్యునల్ కర్నాటకకు కేటాయించిన నీటివాటా నుంచి 2002లో కర్నాటక ప్రభుత్వం రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో అప్పర్ భద్రకు 21.5 టియంసిలు కేటాయించారు. కాగా తుంగభద్ర వేదవతి సబ్ బేసిన్‌లో బచావత్ ట్రిబ్యునల్ చిన్న నీటివనరులకు కేటాయించిన నీటి నుండి 6 టియంసిలు చూపెట్టారు. అప్పటికీ డిపిఆర్ మేరకు నీటి సామర్థ్యం తగ్గినందున పోలవరం ప్రాజెక్టు నీళ్లు కృష్ణలో కలిస్తే ఎగువ రాష్ట్రాలకు చెందవలసిన 45 టియంసిల్లో కర్నాటక వాటా నుండి 2.4 టియంసిలు కలిపి మొత్తం 29.9 టియంసిలుగా కర్నాటక ప్రభుత్వం చూపెడితే కేంద్రప్రభుత్వం గుడ్డిగా వెంటనే ఆమోదించి జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. అందుకేనేమో తెలంగాణ కూడా ముందుజాగ్రత్తగా బచావత్ ట్రిబ్యునల్ తనకు కేటాయించిన చిన్న నీటి వనరుల నుండి పాలమూరు రంగారెడ్డి పథకానికి నికర జలాలను కేటాయించింది.

తొలుత అప్పర్ భద్ర ఎత్తిపోతల పథకం నిర్మాణవ్యయం 16,125.48 కోట్లు కాగా, కర్నాటక ప్రభుత్వం అప్పటికే నాలుగు వేల కోట్ల రూపాయల వ్యయం చేసినందున మిగిలిన 12 వేల కోట్లు కేంద్రప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. అయితే 2018-19 షెడ్యూల్ రేట్ల ప్రకారం, 21,473.67 కోట్ల రూపాయలకు కర్నాటక ప్రభుత్వం అంచనాలను సవరించింది. కేంద్ర ప్రభుత్వం తాజాబడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించినందున సవరించిన అంచనాలను ఆమోదించదేమో? లేకుంటే బడ్జెట్‌లో 5,300 కోట్ల రూపాయల కేటాయింపులు చేయదు కదా? మరోవేపు చట్టబద్ధతగల పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. సవరించిన అంచనా ఆమోదించలేదు.

సెల్: 9848394013

వైఖరి మారకపోతే కఠిన నిర్ణయాలు తప్పవు

- కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- కొలీజియం సిఫార్సుల ఆమోదానికి జాప్యంపై అసంతృప్తి
- రెండ్రోజుల్లో ఐదుగురు జడ్జీల నియామకానికి ఆదేశాలు: అడ్వకేట్ జనరల్

న్యూఢిల్లీ: న్యాయమూర్తుల నియామకాలు, బదిలీలు, పదోన్నతులకు సంబంధించి కొలీజియం సిఫార్సులను ఆమోదించేందుకు కేంద్రప్రభుత్వం తరపు తీవ్రంగా జాప్యం జరుగుతుండటంపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేసింది. కఠిన నిర్ణయాలు తీసుకునేలా చేయొద్దని కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే, గతేడాది డిసెంబరులో సిఫార్సు చేసిన ఐదుగురు జడ్జీల పేర్లను ఆమోదించడంలో కాలయాపనను ప్రశ్నించగా ఆదివారం నాటికి నియామకాలకు ఉత్తర్వులు జారీచేస్తామని కేంద్రం తరపున అడ్వకేట్ జనరల్ వెంకటరమణి తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానంలో నియామకాల కోసం ఐదుగురు జడ్జీల పేర్లను గతేడాది డిసెంబరులో కొలీజియం సిఫార్సు చేయగా, వాటికి త్వరలోనే ఆమోదం తెలుపుతామని కేంద్రప్రభుత్వం తరపున జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకా ధర్మాసనానికి వెంకటరమణి వెల్లడించారు. హైకోర్టు జడ్జీల బదిలీకి సిఫార్సులకు అనుమతులివ్వడంలో కేంద్రం జాప్యం చేస్తుండటంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఇది చాలా చాలా తీవ్రమైన అంశం... మేము కఠిన నిర్ణయం తీసుకునేలా చేయొద్దు... అప్పుడు పరిస్థితి అసౌకర్యంగా మారుతుంది' అని అటార్నీ జనరల్‌తో ధర్మాసనం చెప్పింది. గతేడాది డిసెంబరు 13న సుప్రీంకోర్టు కొలీజియం సర్వోన్నత న్యాయస్థానానికి పదోన్నతికి అర్హులైన ఐదుగురు న్యాయమూర్తుల పేర్లను సిఫార్సు చేసింది. వీరిలో రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పంకజ్ మిథల్, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజయ్ కరోల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పీవీ సంజయ్ కుమార్, పట్నా హైకోర్టు న్యాయమూర్తి ఎహ్‌సానుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి మనోజ్ మిశ్రా ఉన్నారు. ఆపై జనవరి 31న సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేశ్ బైదల్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్ పేర్లను సర్వోన్నత న్యాయస్థానం జడ్జీలుగా పదోన్నతి కోసం సూచించింది. సర్వోన్నత న్యాయస్థానానికి మంజూరైన జడ్జీల సంఖ్య 34 కాగా ప్రస్తుతం 27 మంది న్యాయమూర్తులే ఉన్నారు. కొలీజియం సిఫార్సులను ఆమోదించేందుకు కేంద్రప్రభుత్వం చాలా సమయం తీసుకుంటున్న వ్యవహారాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. గతేడాది డిసెంబరులో పేర్లు సిఫార్సు చేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చేసింది. కేంద్రప్రభుత్వ తీరులో మార్పు మాత్రం రాలేదు. ఆ ఐదుగురి నియమకానికి ఉత్తర్వులు జారీ చేస్తారని భావించాలా? అయితే అది జరిగేదెప్పుడు? అని ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి ఆదివారంలోగా జారీ అవుతాయని వెంకటరమణి చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ సిఫార్సులను ఆమోదించేందుకు జరుగుతున్న జాప్యం ఇబ్బందికరంగా మారింది. బదిలీ ఉత్తర్వులు అమలు చేయకపోతే మేము ఏం చేయాలి? ఇది తేలిగ్గా తీసుకునే అంశం కాదు. ఇదే వైఖరి ఉంటే మేము చాలా చాలా కఠిన నిర్ణయాలను తీసుకోవాల్సి వస్తుంది. మాతో ఆటలాడేందుకు మూడో పార్టీకి అనుమతివ్వబోం' అని సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. కొలీజియం సిఫార్సుల ప్రకారం ఒక హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియామకం పొందాల్సిన ఒకరు 19 రోజుల్లో పదోన్నతి పొందనున్నారు. ఈయన ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందకుండానే రిటైర్ కావాలనే కోరుకుంటున్నట్లున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించగా తమకు విషయం తెలుసునని, తగు చర్యలు తీసుకున్నామని వెంకటరమణి తెలిపారు. 'కొందరి పేర్లను రాత్రికిరాత్రే ఆమోదిస్తూ... మరికొందరి విషయంలో తీవ్ర జాప్యంతో ఏకీకృత వైఖరి లోపించడం స్పష్టమవుతోంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈనెల 13వ తేదీకి వాయిదా వేస్తూ అన్ని సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

వచ్చే ఎన్నికల్లో ఆర్‌వీఎం ఉండదు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో రానున్న ఎన్నికల్లో రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఆర్‌వీఎం)ని ఉపయోగించాలనే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు పేర్కొన్నారు. ప్రవాస భారతీయ (ఎన్ఆర్ఐ) ఓటర్ల వినియోగానికి కూడా ఇది ప్రతిపాదించబడదని శుక్రవారం ఆయన లోక్‌సభకు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రశ్నకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఈ ఏడాది అనేక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్ఆర్ఐ ఓటర్ల వినియోగానికి ఆర్‌వీఎంను ప్రతిపాదించలేదని ఇసి కూడా తెలియజేసిందని మంత్రి చెప్పారు. ఈసీ, ఎన్నికల కమిటీ సాంకేతిక నిపుణుల కమిటీ మార్గదర్శకత్వంలో ప్రభుత్వ రంగ ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)... ఆర్వీఎం నమూనాను అభివృద్ధి చేసినట్లు మంత్రి వెల్లడించారు.

దేశ్‌ముఖ్ సహాయకుడికి బెయిల్

ముంబై: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు చేస్తున్న అవినీతి కేసులో మహారాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ సహాయకుడు కుందన్ షిండేకు ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నేత దేశ్‌ముఖ్‌కు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన షిండేకి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి ఎస్‌హెచ్ గ్వాలానీ అనుమతించారని షిండే తరపు న్యాయవాది అనికేత్ నికమ్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జూన్ 2021లో మనీలాండరింగ్ కేసుకు సంబంధించి షిండేను అరెస్టు చేసింది, ఆ తర్వాత అవినీతి కేసులో సీబీఐ అతడిని కస్టడీలోకి తీసుకుంది.

మనీలాండరింగ్ కేసులో షిండే బెయిల్ పిటిషన్‌ను ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టు బుధవారం అనుమతించింది. ఈ కేసులో ఇతర నిందితుల్లో అనిల్ దేశ్‌ముఖ్, పదవి నుంచి తొలగించిన అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సచిన్ వాజే ఉన్నారు. ఇప్పటికే దేశ్‌ముఖ్ బెయిల్‌పై బయట ఉండగా, వాజే జ్యుడీషియల్ కస్టడీలో కొనసాగుతున్నారు. రెస్టారెంట్లు, బార్‌ల నుంచి నెలకు రూ. 100 కోట్లు వసూలు చేయాలని అప్పటి హోం మంత్రి దేశ్‌ముఖ్ పోలీసు అధికారులకు టార్గెట్ ఇచ్చారని 2021 మార్చిలో ముంబై మాజీ పోలీసు కమిషనర్ పరమ్ బీర్ సింగ్ ఆరోపించారు. గతేడాది ముంబైలోని పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ ఇంటి వద్ద పేలుడు పదార్థాలతో కూడిన వాహనం దొరికిన కేసులో అరెస్టయిన మాజీ అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వాజే కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు. 2021 ఏప్రిల్‌లో హైకోర్టు ప్రాథమిక విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది. విచారణ ఆధారంగా, అవినీతి, అధికార అధికార దుర్వినియోగం ఆరోపణలపై సీబీఐ దేశ్‌ముఖ్, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

5జీ సేవలపై తైవాన్ సహాయం తీసుకోం: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో 5జి సేవల ప్రారంభానికి సంబంధించి తైవాన్ నుంచి భారత్ ఎటువంటి సహాయం తీసుకోవడం లేదని, ఈ దిశగా రెండుదేశాల మధ్య ఎటువంటి అవగాహన కూడా లేదని వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ శుక్రవారం తెలిపారు. భారత్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ, సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను పెంచడానికి ప్రభుత్వం ప్రారంభించిన వివిధ కార్యక్రమాలలో తైవాన్ కంపెనీలు పాల్గొంటున్నాయని ఆమె రాజ్యసభకు రాతపూర్వక సమాధానంలో తెలిపారు. తైవాన్‌తో వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం, సంస్కృతి, విద్య తదితర రంగాల్లో పరస్పర సంబంధాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

5జి సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధించిన అంశాలలో సహాయం కోసం భారతదేశం తైవాన్‌తో అవగాహన కుదుర్చుకోలేదని ఆమె స్పష్టం చేశారు. మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్‌లో చక్కెర ఎగుమతులు 3.21 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయన్నారు. వ్యవసాయ ఎగుమతులకు సంబంధించిన ప్రశ్నకు స్పందిస్తూ... ఈ విషయంలో భారతదేశం వెనుకబడటానికి ప్రధాన కారణం అధిక జనాభా అని పేర్కొన్నారు. ఈ కారణంగా దేశీయంగా భారీ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం జరుగుతోందన్నారు.

152.7 లక్షల టన్నుల ఎరువుల దిగుమతి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు వరకు యూరియా, ఫాస్ఫేటిక్, పొటాషియం సహా 152.7 లక్షల టన్నుల ఎరువులను భారతదేశం దిగుమతి చేసుకున్నట్లు శుక్రవారం కేంద్రం తెలిపింది. లోక్‌సభలో రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖూబా తన వ్రాతపూర్వక సమాధానం ఇస్తూ, 'దేశం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు కాలంలో 62.44 లక్షల టన్నుల యూరియా, 90.26 లక్షల టన్నుల ఫాస్ఫేటిక్, పొటాషియం ఎరువులను దిగుమతి చేసుకుంది' అని తెలిపారు ఫాస్ఫేటిక్, పొటాషియం ఎరువులలో, దేశం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు వరకు 53.18 లక్షల టన్నుల డి-అమోనియం ఫాస్ఫేట్ (డీఏపీ), 16.22 లక్షల టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ), 20.86 లక్షల టన్నుల ఎన్‌పీకే మట్టి పోషకాలను దిగుమతి చేసుకుంది. దేశీయ ఉత్పత్తి విషయానికొస్తే, ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు కాలంలో దేశం మొత్తం ఎరువుల ఉత్పత్తి 362.73 లక్షల టన్నులకు చేరుకుందని మంత్రి చెప్పారు. ఇందులో 210.98 లక్షల టన్నుల యూరియా, 151.75 లక్షల టన్నుల ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులు ఉన్నాయి. 2021-22లో మొత్తం దేశీయ ఎరువుల ఉత్పత్తి 435.95 లక్షల టన్నులు కాగా, దిగుమతులు 182.28 లక్షల టన్నులుగా ఉన్నాయి. దేశంలో తగినన్ని ఎరువుల లభ్యత ఉందని మంత్రి ప్రత్యేక సమాధానంలో తెలిపారు. 2022-23 రబీ (శీతాకాలం) సీజన్‌లో ఒడిశా, బీహార్, ఉత్తరప్రదేశ్‌లో ఎరువుల లభ్యత సౌకర్యంగా ఉందని ఆయన చెప్పారు. అయితే రుతుపవనాలు బాగున్న దృష్ట్యా రాజస్థాన్‌లో ఎరువులకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా రాజస్థాన్‌లో కొనసాగుతున్న రబీ సీజన్‌కు యూరియా, డీఏపీ అవసరాలు వరుసగా 13 లక్షల టన్నుల నుంచి 14.5 టన్నులకు, 3 లక్షల టన్నుల నుంచి 4.5 లక్షల టన్నులకు పెరిగాయని మంత్రి వివరించారు. యూరియాను పోషకాహార ఆధారిత ఎరువుల పథకానికి మార్చే ప్రతిపాదన కూడా లేదని తెలిపారు.

స్కూల్ యూనిఫాంతో అసెంబ్లీకి

డీఎంకే సభ్యుల వినూత్న నిరసన

24 నిమిషాల్లో పుదుచ్చేరి అసెంబ్లీ నిరవధిక వాయిదా

పుదుచ్చేరి: పాఠశాల విద్యార్థుల సమస్యలపై పుదుచ్చేరి అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. పాఠశాల విద్యార్థులకు పుదుచ్చేరి ప్రభుత్వం యూనిఫాం, సైకిళ్లు, ల్యాప్‌టాప్స్ ఇవ్వడం లేదని అక్కడ ప్రతిపక్షంలో ఉన్న డీఎంకే తీవ్రంగా విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పనితీరుపై నిరసన తెలిపేందుకు యూనిఫాం, ఐడీ కార్డ్స్, బ్యాగులు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. సైకిల్ తొక్కుకుంటూ అసెంబ్లీకి చేరుకున్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చినా ఇప్పటి వరకు పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, సైకిళ్లు, ల్యాప్‌టాప్స్ ఎందుకు ఇవ్వడంలేదని ఆల్‌ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని డీఎంకే ఎమ్మెల్యేలు ప్రశ్నించారు.

పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కోసం డిమాండ్

కాగా శుక్రవారం సమావేశమైన పుదుచ్చేరి అసెంబ్లీ కేవలం 24 నిమిషాల్లోనే నిరవధికంగా వాయిదాపడింది. 2022-2023 సంవత్సరానికి అదనపు గ్రాంట్లను మంజూరుకు సభ ఆమోదం తెలిపింది. అలాగే ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన వినియోగాధికార బిల్లును కూడా సభ ఆమోదించింది. అంతకుముందు సభ కార్యకలాపాలు ప్రారంభించిన వెంటనే బ్రిటన్ రాణి క్వీన్ ఎలిజబెత్ -2 మరణానికి సంబంధించి స్పీకర్ ఆర్ సెల్వం సూచన మేరకు సభ నివాళులు అర్పించింది. దివంగత రాణి జ్ఞాపకార్థం శాసనసభ్యులందరూ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఆ తర్వాత యూనిఫాంలు ధరించి, బ్యాగులు పట్టుకుని ఆరుగురు డీఎంకే ఎమ్మెల్యేలు తమ నాయకుడు ఆర్.శివ నేతృత్వంలో పాఠశాల విద్యార్థులకు ఇంకా యూనిఫాంలు అందలేదని నిరసన తెలిపారు. రాష్ట్ర హోదాపై తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శివ మాట్లాడుతూ... పుదుచ్చేరిలో ఎన్నికైన ప్రభుత్వానికి అధికారుల బదిలీచేసే అధికారం లేకపోవడం విచారకరమని అన్నారు. మరో డీఎంకే సభ్యుడు ఏఎంహెచ్ నజీమ్ మాట్లాడుతూ... పుదుచ్చేరిలో ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాలను చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. పుదుచ్చేరికి పూర్తి రాష్ట్ర హోదా కల్పించేందుకు ప్రభుత్వం తీర్మానం చేయాలని ఆయన అన్నారు. ఒకానొక సమయంలో డీఎంకే సభ్యులందరూ 'మాకు రాష్ట్ర హోదా కావాలి, పుదుచ్చేరి మోసపోకూడదు' అని నినదించారు. స్పీకర్ పదేపదే సభ్యులను ప్రశాంతంగా ఉండాలని కోరినప్పటికీ, ఆయన విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ఆ తర్వాత డీఎంకే సభ్యులు కొద్దిసేపు వాకౌట్ చేసి కొన్ని నిమిషాల తర్వాత తిరిగి సభకు వచ్చారు. ఈలోగా సభలో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు కూడా వాకౌట్ చేశారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నిధుల వినియోగాధికార బిల్లును సభ ఆమోదించిన అనంతరం సభను నిరవధికగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సెషన్ కేవలం 24 నిమిషాల పాటు కొనసాగింది.

ద్వేషపూరిత ప్రసంగాలు జరగకుండా చూడాలి

మహారాష్ట్ర పోలీసులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఫిబ్రవరి 5న ముంబైలో హిందూ జన్ ఆక్రోశ్ మోర్చా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు అనుమతిస్తే ఎలాంటి విద్వేషపూరిత ప్రసంగాలు జరగకుండా చూడాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం కోరింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా... ఈ కార్యక్రమం నిర్వహించడానికి అనుమతిస్తే, షరతులకు లోబడి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని జస్టిస్ కేఎం జోసెఫ్, జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనానికి తెలిపారు. 'ఎవరూ ద్వేషపూరిత ప్రసంగాలు చేయరు. చట్టాన్ని ధిక్కరించేలా లేదా పబ్లిక్ ఆర్డర్‌కు భంగం కలిగించరు' అని వివరించారు. మెహతా వాంగ్మూలాన్ని నమోదు చేసిన ధర్మాసనం, కార్యక్రమంలో ఎలాంటి ద్వేషపూరిత ప్రసంగాలు జరగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. 'అనుమతి మంజూరు చేయబడినప్పుడు, సెక్షన్ 151 కింద అధికారాన్ని పొందే సందర్భం ఏర్పడితే, ఆ నిబంధనను అమలు చేయడం సంబంధిత పోలీసు అధికారుల విధి అని కూడా మేము నిర్దేశిస్తున్నాము' అని తెలిపింది. జనవరి 29న జరిగిన హిందూ జన్ ఆక్రోష్ మోర్చా సమావేశంలో ఒక నిర్దిష్ట సమాజానికి వ్యతిరేకంగా ద్వేషపూరిత ప్రసంగాలు చేశారని ఆరోపించిన సంఘటనలు జరగకుండా కోర్టు జోక్యం చేసుకోవాలని కోరుతూ షహీన్ అబ్దుల్లా అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారిస్తోంది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, పోలీసులు నేర ప్రక్రియ (సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 151ని అమలు చేయాలని, ఇది నేరాన్ని నిరోధించడానికి, అరెస్టులు చేయడానికి వారికి అధికారం ఇవ్వాలని అన్నారు. ముంబైలో హిందూ సంస్థ ప్రతిపాదిత కార్యక్రమంలో ద్వేషపూరిత ప్రసంగాలు జరగకుండా చూడాలని సుప్రీంకోర్టు మహారాష్ట్ర పోలీసులను కోరింది. ఈ కార్యక్రమం మొత్తాన్ని వీడియో తీయాలని, నివేదికను కోర్టుకు సమర్పించాలని సిబల్ కోరారు. ఈ మేరకు న్యాయస్థానం కార్యక్రమాన్ని వీడియో తీసి ఒక నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించింది.

శూద్రులంటూ ఎస్పీ అవమానం

మాయావతి విమర్శ

లక్నో: సమాజ్‌వాదీ పార్టీపై బీఎస్పీ అధినేత్రి మాయావతి శుక్రవారం విరుచుకుపడ్డారు. సమాజంలోని అణగారిన వర్గాలను ఎస్పీ తీవ్రంగా అవమానించిందని ఆగ్రహం వెలిబుచ్చారు. శుద్రులు అని పిలవడం ద్వారా అణగారిన వర్గాలను అవమానించవద్దని హితవు పలికారు. భారత రాజ్యాంగం సమాజంలోని బలహీనవర్గాలు, అణగారిన వర్గాలకు సంబంధించిన గొప్ప గ్రంథమని, రామచరిత మానస్, మనుస్మృతి కాదని మాయావతి పేర్కొన్నారు. మహిళలు, శూద్రులకు వ్యతిరేకంగా ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్వామి ప్రసాద్ మౌర్య చేసిన వ్యాఖ్యలపై మాయావతి ట్విట్టర్ వేదికగా తీవ్రంగా స్పందించారు. 'సమాజంలో బలహీనవర్గాలు, అణగారిన వర్గాలకు రామచరితమానస్, మనుస్మృతి ప్రామాణిక గ్రంథాలు కాదు. బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగమనే గ్రంథంలో శుద్రులు అనే మాటే లేదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అని మాత్రమే అంబేద్కర్ రాజ్యాంగంలో రాశారు. అందువల్ల వారిని శూద్రులు అంటూ సమాజ్‌వాదీ పార్టీ అవమానించడం సరికాదు. అలా అంటే రాజ్యాంగాన్ని ధిక్కరించనట్లే'నని ఆమె హిందీలో ట్వీట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, ఎస్పీ వంటి పార్టీలు దళితులు, మహిళలను నిత్యం అవమానిస్తుంటాయని ఆమె పేర్కొన్నారు. 1995 జూన్ 2న లక్నోలోని అతిథిగృహంలో ముఖ్యమంత్రి కాబోతున్న ఓ దళిత ఆడబిడ్డపై దాడి జరిగిందని, అప్పుడు సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉందని, ఈ విషయాన్ని ఎస్పీ అధినేత గుర్తు చేసుకోవాలని మాయావతి పేర్కొన్నారు. ములాయం సింగ్ యాదవ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో మాయావతిపై ఆ దాడి జరిగింది. ఎస్పీ కార్యకర్తలు అతిథి గృహానికి విద్యుత్, నీటి సరఫరా నిలిపివేసి మాయావతిపై దాడి చేశారు. బీజేపీ ప్రజాప్రతినిధి బ్రహ్మదత్ ద్వివేదీ మాయావతిని కాపాడారు. బీఎస్పీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం, మతపరమైన మైనారిటీలు సురక్షితంగా ఉన్నారని, రకరకాల నాటకాలతో వారి ఓట్లతోనే గెలవడానికి ఇతర పార్టీలు ప్రయత్నిస్తుంటాయని మాయావతి విమర్శించారు.

చిన్న అప్పీళ్ల పరిష్కారానికి పథకం

పెండింగ్ తగ్గించడానికి వందమంది జాయింట్ కమిషనర్లు

సీబీడీటీ చైర్‌పర్సన్ నితిన్ గుప్తా

న్యూఢిల్లీ : కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) త్వరలో టీడీఎస్ డిఫాల్ట్ సమస్యలకు సంబంధించిన అప్పీళ్ల పెండింగ్‌ను తగ్గించే బడ్జెట్ ప్రకటనపై ఒక పథకాన్ని విడుదల చేయనున్నట్లు బోర్డు చైర్‌పర్సన్ నితిన్ గుప్తా తెలిపారు. బుధవారం తన బడ్జెట్ ప్రసంగంలో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిన్న అప్పీళ్ల పరిష్కారానికి, కమిషనర్ స్థాయిలో అప్పీళ్ల పెండింగ్‌ను తగ్గించడానికి ఆదాయపు పన్ను శాఖకు చెందిన సుమారు 100 మంది జాయింట్ కమిషనర్లను నియమించాలని ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. 'మేము ఆదాయపు వాపసు ప్రక్రియపై ఒక పథకంతో ముందుకు వస్తాము. ఇక్కడ పరిష్కారం కాని అప్పీళ్లు ప్రధానంగా టీడీఎస్ (మూలం వద్ద పన్ను మినహాయించబడినవి) డిఫాల్ట్, టీడీఎస్ డిఫాల్ట్‌పై ఆర్డర్‌లకు సంబంధించినవి. సర్దుబాటు అవసరమని భావిస్తున్నాము. లేకుంటే, పన్నుచెల్లింపుదారుడు మరోవిధంగా భావిస్తాడు. చిన్న ఆదాయం (వివాదంలో) కేసులు ఉండవచ్చు' అని గుప్తా బడ్జెట్ తర్వాత ఇంటర్వ్యూలో చెప్పారు. అప్పీళ్ల జాయింట్ కమిషనర్‌గా ఉన్న మొదటి అప్పీలేట్ అథారిటీ ద్వారా అప్పీళ్ల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడం ఈ పథకం లక్ష్యం అని అన్నారు. ఆదాయపు పన్ను పథకం కింద, పన్ను అథారిటీ జారీ చేసిన ఉత్తర్వును పన్ను చెల్లింపుదారు ముందుగా కమిషనర్ (అప్పీళ్లు) బాధ్యతలు నిర్వహించే అధికారి ముందు సవాలు చేయవచ్చు. ఆపై ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఐటీఏటీ), హైకోర్టులు, సుప్రీంకోర్టుకు అప్పీలు చేయవచ్చు. ఈ ప్రయోజనం కోసం 100 జాయింట్ కమిషనర్ పోస్టులకు ప్రస్తుత క్యాడర్ నుంచి సిబ్బందిని బోర్డు 'మళ్లిస్తుంది' అని సీబీడీటీ చైర్‌పర్సన్ చెప్పారు. పన్నుదారుకు సంబంధించి మరొక బడ్జెట్ ప్రతిపాదన గురించి మాట్లాడుతూ 'ఈ సంవత్సరం ఇప్పటికే అందుకున్న రిటర్న్‌ల పరిశీలన కోసం కేసులను తీసుకోవడంలో మరింత ఎంపిక చేసుకోవడం' అని గుప్తా తెలిపారు. పన్నుల శాఖ సాంకేతిక సాధనాలను ఎక్కువగా ఉపయోగించడం, ఇ-ధ్రువీకరణ, ఐటీఆర్-యు వంటి చర్యలను ప్రవేశపెట్టడం వల్ల ఇది సాధ్యమవుతుందని అన్నారు. ఆర్థిక మంత్రి ప్రకటించిన ఈ ప్రతిపాదన వెనుక ఉద్దేశం ఏమిటంటే, 'మేము ఇప్పుడు ఎక్కువ సంభావ్యత ఉన్న కేసులను గుర్తించడానికి సాంకేతికత పరంగా మెరుగ్గా సన్నద్ధమయ్యాము' అని ఆయన తెలిపారు. ఇప్పటివరకు పన్ను చెల్లింపుదారులు దాదాపు 10 లక్షల అప్‌డేట్ రిటర్న్‌లు (ఐటీఆర్-యూ) దాఖలు చేశారన్నారు. అధికారుల ప్రకారం, పన్ను శాఖ ప్రస్తుతం చాలా 'తక్కువ' కేసులను ఎంచుకుంటుంది. రిటర్న్‌లను దాఖలు చేసిన తర్వాత, పరిమిత లేదా పూర్తి పరిశీలన కోసం ఒక మదింపుదారుడు సందేహాలను తీర్చడానికి అనేక పత్రాలు, రుజువులు, వివరణలను అందించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా వచ్చే ఆదాయాలపై పన్ను విధించే నిబంధనలు ఈ ఏడాది జులై 1 నుంచి అమల్లోకి వస్తాయని గుప్తా తెలిపారు. ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వ్యక్తి తమ డబ్బును వాలెట్ నుంచి ఉపసంహరించుకున్నప్పుడు లేదా ఆర్థిక సంవత్సరం చివరిలో ఎప్పుడైనా టీడీఎస్ వర్తిస్తుందని అన్నారు. కేవలం రూ.10,000 పరిమితిని రద్దు చేశామని, ఇది పరిశ్రమపైనా, గేమ్ ఆడే వ్యక్తిపైనా ప్రభావం చూపదని తెలిపారు.

ఆరో అంతస్తు నుంచి పడి విద్యార్థి మృతి

కోట: ఎన్నో ఆశలతో నీట్‌కు శిక్షణ తీసుకుంటున్న 20 ఏళ్ల విద్యార్థి హాస్టల్ భవనం 6వ అంతస్తు నుంచి కిందపడి చనిపోయాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన విద్యార్థి ఇషాన్సు భట్టాచార్య కోటలో నీట్‌కు శిక్షణ తీసుకుంటున్నాడు. బాల్కనీలోని రైలింగ్ విరిగి విద్యార్థి కిందపడినట్లు పోలీసులు చెప్పారు. ఆరో అంతస్తు నుంచి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు సీఐ అమర్‌సింగ్ వివరించారు. పశ్చిమబెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లా ధూప్‌గురి గ్రామానికి చెందిన భట్టాచార్య గతేడాది ఆగస్టులో కోటకు వచ్చాడు. మెడికల్ ప్రవేశ పరీక్ష-నీట్‌కు శిక్షణ తీసుకుంటున్నాడు. ఆరో అంతస్తు బాల్కనీలో మరో ఇద్దరు క్లాస్‌మేట్‌లతో భట్టాచార్య మాట్లాడుతున్నాడని, తర్వాత ఇద్దరు మిత్రులు తమ గదులకు వెళ్లగా భట్టాచార్య అదుపు తప్పి కిందపడ్డాడని, అర్ధరాత్రి సమయంలో ఈ దుర్ఘటన జరిగిందని సీఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆసుపత్రికి పంపామని, కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత దీనిని పూర్తి చేస్తామన్నారు. జనవరి 29న కూడా ఇలాంటి ఘటనే ఇక్కడ జరిగింది. జేఈఈ మెయిన్స్‌కు శిక్షణ తీసుకుంటున్న మహారాష్ట్రకు చెందిన విద్యార్థి మొదటి అంతస్తు బాల్కనీ నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

కాషాయ పార్టీ 'ఇల్లు' కూలిపోతుంది

మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే

ముంబై : శాసన మండలి ఎన్నికల్లో విజయం సాధించేందుకు విదర్భలో ఎంవీఏకు బీజేపీ నాయకులు అనేక మంది సాయం చేశారని, కాషాయ పార్టీ 'ఇల్లు' కూలిపోతుందని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే శుక్రవారం తెలిపారు. అధికార ఏక్‌నాథ్ షిండే-బీజేపీ కూటమికి ఎదురుదెబ్బ తగిలి, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ల విభాగాల నుంచి ద్వైవార్షిక ఎన్నికలలో ఐదు స్థానాల్లో మహా వికాస్ అఘాడి మూడు స్థానాలైన నాగ్‌పూర్, ఔరంగాబాద్, అమరావతి గెలుచుకుంది. కొంకణ్, నాసిక్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల నుంచి బీజేపీ, స్వతంత్ర అభ్యర్థి సత్యజిత్ తాంబే గెలుపొందారు. తాంబే తండ్రీకొడుకులు పార్టీకి ద్రోహం చేశారనే విషయాన్ని తాను ఇప్పటికీ సమర్థిస్తున్నానని పటోలే విలేకరులతో అన్నారు. నామినేషన్ దాఖలు చివరి రోజున పార్టీ అధికారిక అభ్యర్థి సుధీర్ తాంబే వైదొలగగా, ఆయన కుమారుడు సత్యజిత్ స్వతంత్ర అభ్యర్థిగా పత్రాలను దాఖలు చేశారు. అప్పుడు కాంగ్రెస్ ఇద్దరినీ సస్పెండ్ చేసింది. సర్వేలు బీజేపీకి రాజు ఎవరో చూపించాయని కూడా పటోలే అన్నారు. విదర్భ మీదుగా సాగిన కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పాదయాత్రలో పార్టీ పట్ల ప్రజల్లో ఉత్సాహాన్ని నింపిన ఘనత ఆయనదని అన్నారు. 'విదర్భ కాంగ్రెస్‌తోనే ఉంది. తప్పుడు సమన్వయం, ప్రణాళికతో మేము దెబ్బతిన్నాము. ఈసారి అందరూ కలసికట్టుగా పనిచేసి ఈ యుద్ధం చేశారు' అని అన్నారు. 'అమరావతి అయినా, నాగ్‌పూర్ డివిజన్ అయినా, బీజేపీ నేతల (ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు స్పష్టమైన సూచన) నుంచి వచ్చిన ఇబ్బందుల కారణంగా చాలా మంది బీజేపీ నేతలు మాకు సహాయం చేశారు. వారి ఇల్లు ఎలా కూలిపోతుందో మీరు చూస్తారు' అని పటోల్ తెలిపారు. తాంబే తిరుగుబాటును పటోల్ ప్రస్తావిస్తూ, దానికి బీజేపీయే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇంటిని బద్దలు కొట్టేందుకు బీజేపీ చేసిన ప్రయత్నం ఆ పార్టీని తీవ్రంగా గాయపరిచిందని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ చివరి నిమిషంలో తాంబేకి మద్దతు పలికింది. 'మీరు మా ఒక శాసనసభ్యుడిని తీసుకున్నారు. నాసిక్ డివిజన్ నుంచి 50 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునేందుకు వ్యూహరచన చేశాము' అని అన్నారు.

కేంద్ర బడ్జెట్ సమగ్రం...సమతుల్యం

నీతి ఆయోగ్ సీఈఓ అయ్యర్

న్యూఢిల్లీ: కేంద్ర వార్షిక బడ్జెట్‌ను నీతి ఆయోగ్ సీఈఓ పరమేశ్వరన్ అయ్యర్ ప్రశంసించారు. బడ్జెట్ చాలా సమగ్రంగా, సమతుల్యంగా ఉందని, వృద్ధిని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అన్ని సంస్కరణలు, ఇతర సామాజిక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు బడ్జెట్ ద్వారా తెలుస్తోందని శుక్రవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో పరిశ్రమనుంచి, వాణిజ్యం వరకు అట్టడుగు స్థాయి నుంచి అందరికీ ఏదో ఉందన్నారు. మౌలిక వసతుల పెట్టుబడులు, సామాజిక రంగం, అలాగే సమాజంలోని పేద, అట్టడుగు వర్గాలకు చేరువ కావడంపై బడ్జెట్ దృష్టి సారించిందని అయ్యర్ పేర్కొన్నారు.

మోదీ ప్రభుత్వ ఆకాంక్షాత్మక బ్లాక్ ప్రోగ్రామ్ (ఏబీపీ)పై అడిగిన ప్రశ్నకు అయ్యర్ సమాధానమిస్తూ, ఏబీపీ... ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్ కింద ఉందని అన్నారు. ఏబీపీని అమలు చేసేందుకు అన్ని రాష్ట్రాలు అంగీకరించాయని తెలిపారు. గత నెల, 112 వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో, అవసరమైన ప్రభుత్వ సేవలను సమగ్రంగా అమలు చేసేలా 500 బ్లాక్‌లను కవర్ చేసేలా ఏబీపీని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి స్టేట్ సపోర్ట్ మిషన్‌పై కూడా ఆయోగ్ పనిచేస్తోందని అయ్యర్ చెప్పారు. 'మేము రాష్ట్ర ప్రభుత్వాలకు వారి స్వంత సంస్థలను అభివృద్ధి చేయడంలో సహాయం చేస్తున్నాము. వాటిలో ఐదు లేదా ఆరు రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ సపోర్ట్ మిషన్ కింద దీన్ని పూర్తి చేశారు' అని ఆయన వెల్లడించారు. సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో జాతీయ ప్రాధాన్యతల కోసం సమిష్టి ప్రయత్నాల కోసం నీతి ఆయోగ్ స్టేట్ సపోర్ట్ మిషన్‌ను మూడేళ్లపాటు కొనసాగిస్తామని చెప్పారు. దేశంలో పెరుగుతున్న అసమానతలను పరిష్కరించడంలో కేంద్ర బడ్జెట్... మరో అవకాశాన్ని కోల్పోయిందని ఆక్స్‌ఫామ్ ఇండియా ఇటీవల చేసిన ప్రకటనపై స్పందించిన అయ్యర్, వాటితో తాను ఏకీభవించడం లేదని అన్నారు. ఈ బడ్జెట్ మొదటిసారిగా గిరిజనుల్లో అత్యంత బలహీనంగా ఉన్న వారిపై దృష్టి సారించిందని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి

- ఏపీ రైతు సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- కేటాయింపులు తగ్గించడాన్ని నిరసిస్తూ 9న రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆందోళన
- సమావేశాలు, సభల ద్వారా ప్రచారం

విశాలాంధ్ర-విజయవాడ: వ్యవసాయ రంగం సంక్షోభం కారణంగా రైతాంగం పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ఈ రంగానికి నిధులు పెంచాల్సిందిపోయి తగ్గించటం ఆక్షేపణీయమని వక్తలు పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమానికి 2023-24 బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇచ్చి నిధులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో శుక్రవారం విజయవాడ దాసరి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నల్ల వ్యవసాయ చట్టాలు, విద్యుత్ బిల్లు రద్దు కోసం రైతాంగం చారిత్రాత్మక పోరాటం నిర్వహించడంతో ప్రధాన మంత్రి రైతాంగానికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి మూడు నల్ల చట్టాలను రద్దు చేశారని వక్తలు గుర్తు చేశారు. ఆ సందర్భంగా రైతు సంఘాల ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీల అమలుకు ఈ బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేకపోవడం మోసపూరితమని అనేక మంది నేతలు అభిప్రాయపడ్డారు. రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం నల్ల చట్టాలను వెనక్కు తీసుకుంటూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ వాటి అమలు ఊసే లేదన్నారు. సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఎగువ భద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం సమంజసం కాదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు, రాష్ట్రంలోని నీటి హక్కులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణానికి బడ్జెట్‌లో కేవలం రూ.478 కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 30 శాతం కోత విధించడం వల్ల పని దినాలు కోల్పోయి వ్యవసాయ కార్మికులు వీధిన పడతారన్నారు. క్రమక్రమంగా ఈ పథకానికి నిధులు తగ్గించటం వల్ల గ్రామీణ పేదలు దెబ్బతింటారన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఎఫ్‌సీఐలను రద్దు చేయడానికే 90 వేల కోట్లు తగ్గించారన్నారు. ఆహార సబ్సిడీకి కోతలు పెట్టడం వల్ల పేదల జీవితాలు దుర్లభమవుతాయన్నారు. అయోధ్యలో రామమందిరంపై ఉన్న శ్రద్ధ రైతాంగంపై లేదని విచారం వ్యక్తం చేశారు. తెలుగు రైతు నాయకులు కె.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎరువులకిచ్చే సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం తగ్గించటం వల్ల రైతాంగంపై మరింత భారం పడుతుందన్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ కేంద్రం మన రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయడంలో విఫలమయిందన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ సాగునీటి రంగానికి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడాన్ని నిరసిస్తూ ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపడతామని, అలాగే అన్ని నియోజకవర్గాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సభల ద్వారా వారం రోజులపాటు ప్రచారం నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ తెలిపారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్ రైతు గేయాలు ఆలపించారు. ఈ సమావేశానికి రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి మల్నీడు యలమందరావు స్వాగతం పలకగా, మరో కార్యదర్శి పి.జమలయ్య తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తోట ఆంజనేయులు, డి.హరనాథ్, అమరావతి జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్, పోతుల బాలకోటేశ్వరరావు, జాగృతి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మరీదు ప్రసాద్, అఖిల భారత రైతు సమాఖ్య అధ్యక్షులు ఎం.వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు, బుడ్డి రమేష్, పి.వి. ఆంజనేయులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణంపై

సీఎం, ఎంపీలు గళం విప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తుంగభద్ర ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక రాష్ట్రంలో ఎగువభద్ర ప్రాజెక్టుకు కేంద్రం నిధులు కేటాయించడంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. అలాగే ఏపీకి చెందిన ఎంపీలంతా గళం విప్పాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా మోదీ ప్రభుత్వం కుటిల రాజనీతిని ప్రదర్శించింది. ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని తెరపైకి తెచ్చి, జాతీయ హోదా కల్పించి, నిధులు కేటాయించింది. కేంద్ర బడ్జెట్‌లో తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న ఎగువభద్ర ఎత్తిపోతల పథకానికి రూ.5,300 కోట్లు కేటాయించింది. ఎగువభద్ర ప్రాజెక్టుతో రాయలసీమ జిల్లాలైన అనంతపురం, కర్నూలు, కడపకు నీటి కొరత ఏర్పడుతుంది. తాజా పరిణామంతో అనేక సంవత్సరాలుగా తుంగభద్ర నదిపై రాయలసీమ ప్రతిపాదనలో ఉన్న గుండ్రేవుల ప్రాజెక్టును మరుగున పడింది. గుండ్రేవుల ప్రాజెక్టు కోసం 29 టీఎంసీల నీటిని బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. ఏళ్ల తరబడి గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. గుండ్రేవుల నిర్మాణం పూర్తి కాకపోవడం, హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి పూడిక తీయకపోవడం వల్ల రాయలసీమ ప్రాంతానికి నీరు లభ్యత ఇబ్బందైంది. సిద్ధేశ్వరం, గుండ్రేవుల ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కర్ణాటకలో తుంగభద్రకు ఎగువన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే రాయలసీమకు ఎనలేని నీటి కొరత ఏర్పడుతుంది. అందువల్ల రాయలసీమ ప్రాంత ప్రయోజనాల దృష్ట్యా సీఎం జగన్ తక్షణమే స్పందించాలని, ఎంపీలంతా పార్లమెంటు సమావేశాల్లో నిరసన వ్యక్తం చేయాలని రామకృష్ణ కోరారు.

బ్యాంకింగ్ రంగానికి ధోకా లేదు...

అదానీ వ్యవహారంపై ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల పతనం ప్రభావం బ్యాంకింగ్ రంగంపై ఉండబోదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దశాబ్దాలుగా అనేక అంశాల నుంచి భారత మార్కెట్లు పాఠాలు నేర్చుకున్నాయని చెప్పారు. అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ, ఎస్‌బీఐ పెట్టుబడులు మితంగానే ఉన్నాయని అన్నారు. అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో పెట్టుబడులు మితంగా ఉన్నట్లు ఎస్‌బీఐ, ఎల్ఐసీ సంస్థలు ప్రకటించడాన్ని ప్రస్తావించారు. భారతీయ మార్కెట్ల పటిష్ఠత విషయంలో నియంత్రణ సంస్థలు నిక్కచ్చిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కేవలం ఒక ఉదంతాన్ని ఆధారంగా చేసుకొని భారత మార్కెట్లను అంచనా వేయడం సరికాదని ప్రముఖ వార్తాఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీతారామన్ అన్నారు. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉందని 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ బోర్డు', ఆర్‌బీఐతో సమీక్ష తర్వాత బాధ్యతాయుతంగా చెప్పగలనన్నారు. బ్యాంకుల నిరర్థక ఆస్తులు తగ్గుతున్నట్లు తెలిపారు. విదేశీ మదుపర్లు నిశ్చింతగా భారత్‌లో పెట్టుబడులు కొనసాగించవచ్చన్నారు. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక కారణంగా అదానీ గ్రూప్ సంస్థల షేర్లు పతనమయ్యాయి. కుబేరుల్లో మూడవ స్థానంలో ఉన్న గౌతం అదానీ ర్యాంకు అమాంతం పడిపోయింది. తాజా పరిణామాల దృష్ట్యా అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, ప్రత్యేక ఆర్థిక జోన్, అంబుజా సిమెంట్స్ వంటి అదానీ గ్రూపు కంపెనీలను ఏఎస్ఎం (స్వల్పకాల అదనపు నిఘా) పరిధిలో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఉంచాయి. హిండెన్‌బర్గ్ నివేదికను అదానీ గ్రూపు తోసిపుచ్చింది. అవన్నీ అవాస్తవాలని, నిరాధారమని చెప్పింది. ఎస్‌బీఐ, ఎల్ఐసీ కూడా సమగ్ర నివేదికలను విడుదల చేస్తూ తమకు ధోకా లేదని చెప్పుకున్నాయి. కాగా అదానీ గ్రూప్ రుణాలు, ఈక్విటీల్లో ఎల్ఐసీకు రూ.36,474 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇవి తమ మొత్తం పెట్టుబడుల్లో ఒక శాతం కంటే తక్కువేనని ఎల్ఐసీ ఇటీవల వెల్లడించింది.

రాజకీయ పార్టీల ఆర్థిక నియంత్రణ ప్రతిపాదన లేదు

కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీల ఆర్థిక నియంత్రణకు ఎలాంటి ప్రతిపాదన లేదని ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభకు తెలిపింది. 'రాజకీయ పార్టీల ఆర్థిక నియంత్రణను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నదా' అనే ప్రశ్నకు, న్యాయ మంత్రి కిరెన్ రిజిజు... దేశంలో ప్రస్తుతం ఉన్న ఎన్నికల పద్ధతులను మెరుగుపరచడానికి ఎన్నికల సంస్కరణలను తీసుకురావడానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందని తన రాతపూర్వక సమాధానంలో తెలిపారు. 'ఎన్నికల సంస్కరణలు నిరంతర, కొనసాగుతున్న ప్రక్రియ, దేశంలో ప్రస్తుతం ఉన్న ఎన్నికల పద్ధతులను మెరుగుపరచడానికి, ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘం వివిధ ప్రతిపాదనలను పరిశీలించిన తర్వాత, వివిధ సవరణల ద్వారా ఎప్పటికప్పుడు వాటిని అమలు చేస్తుంది' అని ఆయన అన్నారు.

హోదా, విభజన హామీలపై మౌనమేల?

వైసీపీ, టీడీపీ, జనసేనకు నాయకుల సూటిప్రశ్న

విజయనగరం జిల్లాకు సమరయాత్ర

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు జరుగుతున్న సమరయాత్ర శుక్రవారం విజయనగరం జిల్లాకి చేరింది. బస్సుయాత్రకు ఘనస్వాగతం లభించింది. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులతో నాయకులు మాట్లాడారు. అనంతరం విజయనగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాలాజీ జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా కార్యదర్శులు ఎస్.నాగభూషణం. రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు 9 ఏళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. అయినా గతంలో టీడీపీ, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వాలు నోరు మెదపలేదన్నారు. ఆ పార్టీలకు స్వార్థ రాజకీయాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదని మండిపడ్డారు. అందుకే విద్యార్థి, యువజన సంఘాలు ఉద్యమం చేపట్టాయని, దీనితోనైనా రాజకీయ నాయకులు కళ్లు తెరవాలని హితవు పలికారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి సక్రమంగా నిధులు ఇవ్వకపోయినా, విశాఖ ఉక్కుని అమ్మేసినా, గిరిజన విద్యాలయానికి నిధులు కేటాయించక పోయినా... వైసీపీ, టీడీపీ, జనసేన మాత్రం బీజేపీకి వంతపాడు తున్నాయని విమర్శించారు. హోదా, విభజన హామీలు సాధించలేని పార్టీలకు 2024 ఎన్నికల్లో బుద్ధిచెపుదామని విద్యార్థి, యువజనులకు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.కామేశ్వరరావు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పరిశ్రమలు, రైల్వేజోన్, నీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ఆదుకుంటామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మూతబడిన జ్యూట్, ఫెర్రోయిల్లాస్ పరిశ్రమలు తెరిపించి యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమరయాత్రకు పూర్తి మద్దతు తెలిపారు. వైసీపీ, టీడీపీ, జనసేన ఎవరి పక్షమో తేల్చుకోవాలని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ, సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సీహెచ్.పావని, డీఐఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, నాయకులు సునీల్, నాగభూషణం, వి.రాజేశ్, కోట అప్పన్న, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు

- అంతిమ యాత్రకు తరలివచ్చిన అభిమానులు
- సినీ, రాజకీయ ప్రముఖుల నివాళి
- పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు



విశాలాంధ్ర-హైదరాబాద్: దిగ్గజ దర్శకుడు, కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ ప్రస్థానం ముగిసింది. విశ్వనాథ్ భౌతికకాయానికి ఆయన కుమారులు నాగేంద్రనాథ్, రవీంద్రనాథ్ పంజాగుట్ట శ్మశానవాటికలో శుక్రవారం మధ్యాహ్నం అంతిమ సంస్కారాలు నిర్వహించారు.సినీ, రాజకీయ ప్రముఖులు, బంధువులు, సన్ని హితులు, అభిమా నుల ఆశ్రు నయనాల మధ్య దిగ్గజ దర్శకుడికి కడసారి వీడ్కోలు పలికారు. వీరశైవ జంగమ సంప్రదాయం ప్రకారం కళాతపస్వి అంత్యక్రియలు జరిగాయి. ఆయన్ని కూర్చోబెట్టి ఖననం చేశారు. గతంలో దిగ్గజ గాయకుడు, గానగాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భౌతికదేహాన్ని కూడా ఇలానే కూర్చోబెట్టి ఖననం చేశారు. ఎస్పీ బాలు, కె.విశ్వనాథ్ చాలా దగ్గరి బంధువులు అన్న సంగతి తెలిసిందే. బాలుకి కె.విశ్వనాథ్‌కు సోదరుడవుతారు. అంతకుముందు, ఫిలింనగర్ లోని ఆయన నివాసం నుంచి పంజాగుట్ట శ్మశాన వాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. తెలుగు జాతి గర్వించదగ్గ దిగ్గజ దర్శకుడు కె.విశ్వనాథ్ కు కడసారి వీడ్కోలు పలికేందుకు అభిమానులు భారీ సంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొన్నారు. 92 ఏళ్ల కాశీనాథుని విశ్వనాథ్.. గత కొంతకాలంగా వయో భారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. చాలాకాలంగా ఇంటికే పరిమితమైన విశ్వనాథ్.. గురువారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ని వెంటనే ఫిలింనగర్ అపోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. విశ్వనాథ్ భౌతికదేహాన్ని రాత్రే ఆస్పత్రి నుంచి ఇంటికి తరలించారు. శుక్రవారం ఉదయం సినీ ప్రముఖు లంతా విశ్వనాథ్ ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు, మెగాస్టార్ చిరంజీవి, ప్రముఖ నటులు చంద్రమోహన్, కోటా శ్రీనివాసరావు, బ్రహ్మానందం, రాధికా శరత్‌కుమార్, విక్టరీ వెంకటేశ్, పవన్ కల్యాణ్, తనికెళ్ల భరణి, నాజర్, సాయికుమార్, బ్రహ్మాజీ, మురళీ మోహన్, రాజా రవీంద్ర, దర్శకులు కె.రాఘవేంద్రరావు, త్రివిక్రం శ్రీనివాస్, గుణశేఖర్, సత్యానంద్, ఎస్.ఎస్.రాజమౌళి, బోయపాటి శ్రీను, మెహర్ రమేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, అల్లు అరవింద్, డి.సురేష్ బాబు, సంగీత దర్శకులు మణిశర్మ, ఎం.ఎం.కీరవాణి, వందేమాతరం శ్రీనివాస్, రచయిత పరుచూరి గోపాల కృష్ణ, నిర్మాతలు అశ్వనీదత్, సి.కల్యాణ్, సినీ గేయరచయిత చంద్రబోస్ తదితరులు విశ్వనాథ్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. ఆ తరవాత మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఫిలింనగర్‌లోని కె.విశ్వనాథ్ నివాసం నుంచి పంజాగుట్ట శ్మశాన వాటికకు అంతిమయాత్ర ప్రారంభమైంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో విశ్వనాథ్ భౌతిక దేహాన్ని ఖననం చేశారు. ఎలాంటి హడావుడి లేకుండా అంత్యక్రియలను ముగించారు.

'శంకరాభరణం'తో వీడని అనుబంధం

ఇదిలా ఉండగా, సరిగ్గా 43 ఏళ్ల క్రితం తన సినిమా 'శంకరాభరణం' విడుదలైన ఫిబ్రవరి 2వ తేదీనే కె.విశ్వనాథ్ కన్నుమూశారు. మరణంలోనూ ఆయన తన క్లాసిక్ మూవీతో అనుబంధాన్ని వదులుకోలేదు. తొలి సినిమానే అక్కినేని నాగేశ్వరరావు లాంటి దిగ్గజ నటుడితో చేసిన కె.విశ్వనాథ్.. దానికి నంది అవార్డు కూడా అందుకోవడం గొప్ప విషయం. మొత్తం 8 నంది అవార్డులు తన ఖాతాలో వేసుకున్నారు. అంతేకాక 'శంకరాభరణం' సినిమాకు జాతీయ చలనచిత్ర పురస్కారం దక్కింది. సినిమా రంగానికి ఆయన చేసిన కృషికి 2016లో ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చింది. 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారం, పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ఎన్నో విశ్వ విద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశాయి.

గుంటూరు జిల్లా నుంచి ప్రస్థానం

గుంటూరు జిల్లా రేపల్లె మండలం పెదపులివర్రు గ్రామం విశ్వనాథ్ స్వస్థలం. 1930 ఫిబ్రవరి 19న కాశీనాథుని సుబ్రహ్మణ్యం, సరస్వతమ్మ దంపతులకు విశ్వనాథ్ జన్మించారు. కె.విశ్వనాథ్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో బీఎస్సీ చదివారు. ఆ తర్వాత 1957లో వాహిని స్టూడియోస్‌లో సౌండ్ ఆర్టిస్టుగా సినీ కెరీర్‌ను మొదలుపెట్టారు. అనంతరం సహాయ దర్శకుడిగా, దర్శకుడిగా 50 సినిమాలు వరకు చేశారు. దర్శకుడిగా ఆయన తొలి సినిమా ఆత్మగౌరవం కాగా చివరి సినిమా శుభప్రదం. సిరిసిరిమువ్వ, శంకరా భరణం, సప్తపది, సాగరసంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, శ్రుతిలయలు, స్వయంకృషి, స్వర్ణకమలం, సూత్రధారులు, స్వాతికిరణం వంటి ఎన్నో క్లాసికల్ చిత్రాలను ఆయన తెలుగు ప్రేక్షకులకు అందించారు. కేవలం దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా తన సత్తాచాటారు. శుభసంకల్పం సినిమాతో తొలిసారి వెండితెరపై ఆయన కనిపించిన ప్రేక్షకులను మెప్పించారు. తరువాత వజ్రం, కలిసుందాంరా, నరసింహనాయుడు, సీమసింహం, నువ్వులేకనేను లేను, సంతోషం, లాహిరి లాహిరి లాహిరిలో, ఠాగూర్ వంటి పలు సినిమాల్లో మంచి పాత్రలతో మెప్పించారు. భారతీయ సంస్కృతికి చిహ్నమైన శాస్త్రీయ కళలను తన కథలుగా మలుచుకొని, అద్భుతమైన చిత్ర కావ్యాలను తెరకెక్కించి దర్శకుడు విశ్వనాథ్ కళాతపస్వి అనిపించుకున్నారు. భారతీయ కళల నేపథ్యంలో ఆయన తీసిన చిత్రాలు శంకరాభరణం, సాగరసంగమం, శృతిలయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం ప్రధానమైనవిగా నిలిచాయి. ముఖ్యంగా సాంఘిక సమస్యలను ప్రస్తావిస్తూ ఆయన తీసినచిత్రాల్లో సప్తపది, స్వాతిముత్యం, స్వయంకృషి, శుభోదయం, శుభలేఖ, ఆపద్బాంధవుడు, శుభసంకల్పం ముఖ్యమైనవిగా చెప్పుకోవచ్చు. దర్శకుడిగా జోరు తగ్గాక సినిమాల్లో నటించడం మొదలుపెట్టారు.

ప్రధాని మోదీ, సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన్ సంతాపం

విశ్వనాథ్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సినీరంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన మరణం సినీపరిశ్రమకు తీరని లోటన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్మోహన్ రెడ్డి, కేసీఆర్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు సినిమాను జగద్విఖ్యాతం చేయడంలో విశ్వనాథ్ చేసిన కృషి మరువలేనిదని కీర్తించారు. సహా రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్, ఇతర ప్రతిపక్షాల నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

తెలుగు చిత్రసీమలో ఆయన మహాసాగరం

కళాతపస్వి విశ్వనాథ్ తెలుగు చిత్రసీమలో మహాసాగరం వంటి వారని పద్మశ్రీ డా. కూటికుప్పల సూర్యారావు కొనియాడారు. శంకరాభరణంలో సోమయాజులు గారి నటనా వైదుష్యం వెనుక విశ్వనాథ్ గారి సృజనాత్మక దర్శకత్వ ప్రతిభ జ్యోతకమవుతుందన్నారు. సాహిత్యం ఆయన ప్రాణం, సంగీతం ఆయన గానం, సంస్కారం ఆయన ప్రతిబింబం తెలుగు చిత్రసీమలో ఆయనో మహాసాగరమని పేర్కొన్నారు. కొప్పరపు కళాపీఠం పురస్కారోత్సవాల్లో విశ్వనాథ్‌తో వేదిక పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానంటూ విశ్వనాథ్ మరణానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.